సమగ్ర సమాచార పత్రిక

# ముద్ర

www.mudranews.in

హైదరాబాద్
శుక్రవారం, 29.05.2026

www.mudranews.in | @mudranews

సంపుటి:13 సంచిక: 217
పేజీలు: 08 వెల: రూ. 5



# ఎన్టీఆర్ దేశం గర్వించే మహానేత..

## ఆయన స్ఫూర్తితోనే ప్రజా పాలన: సీఎం రేవంత్ రెడ్డి

04

- ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ జీవితాంతం గుర్తుండే జ్ఞాపకమన్న సీఎం
- అంబేద్కర్, ఇందిరాగాంధీ, ఎన్టీఆర్‌లను జాతిరత్నాలు
- కులాలు, ప్రాంతాలకు అతీతంగా ఎన్టీఆర్ ప్రజానాయకుడు
- ఫ్యూచర్ సిటీతో యువతకు భారీ ఉద్యోగ అవకాశాలు
- 2034 వరకు ప్రజా ప్రభుత్వానిదే అధికారం

## ప్రతి పౌరుడికి సమగ్ర

# సంక్షేమ కార్డ్

## ఒకే కార్డులో వివరాలు

- ఏ శాఖ ద్వారా, ఏ పథకం కింద, ఎంత మేర లబ్ధి చేకూరుతోందో పక్కా సమాచారం
- డేటాను సేకరించేందుకు ప్రత్యేక డ్రైవ్
- సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

రాష్ట్రంలోని ప్రతి పౌరుడికి అందుతున్న సంక్షేమ పథకాల వివరాలన్నీ ఒకే కార్డులో ఉండేలా 'సమగ్ర సంక్షేమ కార్డును (యూనిఫైడ్ కార్డ్ ) రూపొందించాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఏ పౌరుడికి ఏ శాఖ ద్వారా, ఏ పథకం కింద, ఎంత మేర లబ్ధి చేకూరుతోందో ఈ కార్డ్ ద్వారా స్పష్టంగా తెలిసేలా ఉండాలని సూచించారు. తక్షణమే అందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని, అన్ని శాఖల నుంచి డేటాను సేకరించేందుకు ప్రత్యేక చేపట్టాలని ఆదేశించారు. రాష్ట్ర సచివాలయంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, సీఎస్ రామకృష్ణారావు, సీఎం స్పెషల్ సెక్రటరీ అజిత్ రెడ్డి, ఐటీ శాఖ జాయింట్ సెక్రటరీ ఉన్నతాధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. మిగతా 02లో




## కర్ణాటకలో కొత్త

# అధ్యాయం..

## డీకే శివకుమార్‌కు సీఎం పీఠం

- ముగిసిన సిద్ధరామయ్య శకం
- సీఎం పదవికి రాజీనామా సమర్పణ
- డీకే శివకుమార్‌కు లైన్ క్లియర్!

**ముద్ర డెస్క్ :**

కర్ణాటక రాజకీయాల్లో కీలక మలుపు చోటు చేసుకుంది. రాష్ట్ర రాజకీయాల్లో దాదాపు మూడు దశాబ్దాలుగా ప్రభావశీల నాయకుడిగా కొనసాగుతున్న సిద్ధరామయ్య తన ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయడంతో కాంగ్రెస్‌లో అధికార మార్పిడికి తెరలేచింది. ఈ పరిణామంతో ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ రాష్ట్ర తదుపరి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టడం దాదాపు ఖాయమైంది. గురువారం మధ్యాహ్నం బెంగళూరులోని రాజ్‌భవన్‌కు చేరుకున్న సిద్ధరామయ్య తన రాజీనామా పత్రాన్ని గవర్నర్ ప్రత్యేక కార్యదర్శికి అందజేశారు. గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్ నగరంలో అందుబాటులో లేకపోవడంతో ఈ ప్రక్రియ అధికారికంగా పూర్తి చేశారు. ఈ సందర్భంగా మంత్రులు, ఎమ్మెల్యేలు, ముఖ్య అనుచరులు ఆయన వెంట ఉండటం గమనార్హం. మిగతా 02లో








## హైదరాబాద్ రియల్ ఎస్టేట్

# రికార్డు

### ఎకరం రూ.237 కోట్లు

## రాయదుర్గం భూములకు భారీ డిమాండ్

- రికార్డులు బద్దలు కొట్టిన రాయదుర్గం
- హైదరాబాద్ వైపు దేశం చూపు
- హైటెక్ సిటీ పక్కనే గోల్డ్ జోన్
- కోకాపేట తర్వాత రాయదుర్గం సెన్సేషన్
- ఆకాశంలో హైదరాబాద్ భూముల ధరలు
- 'హైదరాబాద్ డౌన్' ప్రచారానికి గట్టి సమాధానం

**ముద్ర డెస్క్ :**

హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్ కుప్పకూలిపోయిందని.. హైడ్రా కారణంగా నగర ప్రతిష్ట దెబ్బతిందని కొంతకాలంగా జరుగుతున్న ప్రచారానికి రాయదుర్గం భూముల వేలం గట్టి సమాధానం ఇచ్చింది. దేశవ్యాప్తంగా దృష్టిని ఆకర్షిస్తూ హైదరాబాద్ నగరంలో ఎకరం భూమి ధర ఏకంగా రూ.237 కోట్లకు చేరుకోవడం సంచలనంగా మారింది. రాయదుర్గం ప్రాంతంలో టీజీఐఐసీ నిర్వహించిన భూముల వేలంలో ఈ రికార్డు ధర నమోదవడంతో దేశవ్యాప్తంగా రియల్ ఎస్టేట్ వర్గాలు హైదరాబాద్ వైపు చూస్తున్నాయి.


గతంలో కోకాపేట ప్రాంతంలో ఎకరం రూ.100 కోట్లు పలికినప్పుడు దేశవ్యాప్తంగా చర్చ జరిగింది. అనంతరం గతేడాది రాయదుర్గం నాలెడ్జ్ సిటీ ప్రాంతంలో ఎకరం రూ.177 కోట్లకు అమ్ముడై పాత రికార్డులను చెరిపేసింది. ఇప్పుడు అదే ప్రాంతంలో ఎకరం రూ.237 కోట్లకు చేరుకోవడం హైదరాబాద్ రియల్ ఎస్టేట్ సామర్థ్యాన్ని మరోసారి నిరూపించింది.

**ఎందుకింత డిమాండ్?**

రాయదుర్గం ప్రస్తుతం హైదరాబాద్ నగరానికి అత్యంత కీలక వాణిజ్య కేంద్రంగా మారింది. హైటెక్ సిటీ, గచ్చిబౌలి, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ మధ్యలో ఉండటం ఈ ప్రాంతానికి భారీ ప్లస్ పాయింట్. మియాపూర్ మెట్రో కనెక్టివిటీ, ఔటర్ రింగ్ రోడ్, శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి సులభ రాకపోకలు ఉండటంతో కంపెనీలు ఈ ప్రాంతంపై దృష్టి సారిస్తున్నాయి. ఐటీ, ఫార్మా, ఫైనాన్స్, హెల్త్ కేర్, లైఫ్ సైన్సెస్, ఎడ్యుకేషన్, ఎంటర్టైన్‌మెంట్ రంగాలకు రాయదుర్గం కేరాఫ్ అడ్రస్‌గా మారింది. ముఖ్యంగా గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్లు (GCCs) భారీగా ఏర్పడుతున్నాయి. అంతర్జాతీయ కంపెనీలు తమ కార్యాలయాలను ఇక్కడ ఏర్పాటు చేసుకుంటుండటంతో గ్రేడ్-ఏ ఆఫీస్ స్పేస్‌కు విపరీతమైన డిమాండ్ నెలకొంది. మిగతా 02లో

## ఫ్యూచర్ సిటీ భూములకు రికార్డు ధరలు

- రావిర్యాలలో రూ.83,500 పలికిన చదరపు గజం భూమి
- విక్రయాల ద్వారా రూ. 140 కోట్లు ఆదాయం
- హౌసింగ్ బోర్డు స్థలాలకు భారీ డిమాండ్



## ఎన్టీఆర్‌కు భారతరత్న

# తెలుగువారి ఆకాంక్ష

### తెలుగుజాతి గుండెలో శాశ్వతంగా ఎన్టీఆర్: సీఎం చంద్రబాబు



- లోకేష్ ప్రతిపాదించిన మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు మనమే ప్రారంభిద్దాం
- మహానాడు సభలో టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు

02

# మీ రాజకీయాల కోసం వాడుకోవద్దు




- అది'రైతు గోస' కాదు.. అధికారం కోసం బీజేపీ నాయకుల 'రాజకీయ ఘోష'
- ప్రజల్ని తప్పదోవ పట్టించేలా బీఆర్ఎస్ డైవర్షన్ పాలి'ట్రిక్స్'
- ధాన్యం కొనుగోళ్లపై ప్రతిపక్షాలది దుష్ప్రచారం: మంత్రి శ్రీధర్ బాబు ఫైర్

03

# ఆధ్యాత్మిక వైభవం

## కర్పూర దీప కాంతుల్లో దివ్యక్షేత్రంలో వెలుగులు

- కాశీ పండితుల వేదఘోషల మధ్య భక్తి పరవశం
- వైభవంగా కొనసాగుతున్న సరస్వతి పుష్కరోత్సవం



సరస్వతీ అంత్య పుష్కరాల సందర్భంగా దక్షిణకాశీగా పేరుగాంచిన కాళేశ్వర ముక్తేశ్వర స్వామి దేవస్థానం గురువారం ఆధ్యాత్మిక వైభవంతో కళకళలాడింది. ఎనిమిదోరోజు తెల్లవారుజాము నుండి వేలాదిమంది భక్తులు పవిత్ర త్రివేణి సంగమానికి చేరుకుని పుష్కర స్నానాలు ఆచరించారు. వేదఘోషలు, శివనామస్మరణలు, హరహరమహాదేవ నినాదాలతో క్షేత్రమంతా భక్తిమయ వాతావరణంలో మారు మోగిపోయింది.

04

-మహదేవపూర్, ముద్ర:

## పాపం

04

# సన్ రైజర్స్

## పరుగుల వర్షం కురిపించినా కలిసి రాని అదృష్టం


- బ్యాటింగ్ బీభత్సం.. బౌలింగ్‌లో దుమ్మురేపినా కప్పు కలనే
- క్లాసెన్ నుంచి మలింగ వరకూ మెరుపులు.. ఎలిమినేటర్‌లో షాక్
- సన్ రైజర్స్ సీజన్ సూపర్.. వైభవ్ సూర్యవంశీ దెబ్బతో కలలు చెదిరిన క్షణం
- స్టార్లు రాణించారు.. కానీ రాజస్థాన్ తుఫాన్ ఎదుట హైదరాబాద్ ఆశలు ఆవిరి

**కల చెదిరే, గుండె పగిలే**




ఈ సీజన్ అంతా సన్‌రైజర్స్ హైదరాబాద్ బ్యాటర్లు, బౌలర్లు రికార్డుల వేటతో ఊచకోత కోశారు. క్లాసెన్, ఇషాన్, అభిషేక్, హెడ్ పరుగుల సునామీ సృష్టిస్తే.. ఇషాన్ మలింగ, సాకిబ్, ప్రఫుల్ వికెట్ల పండగ చేసుకున్నారు. ఈ అద్భుత ప్రదర్శనతో ఈసారి కప్పు మనదే అని అభిమానులు ఆశపడ్డారు. కానీ, ఎలిమినేటర్‌లో రాజస్థాన్ రాయల్స్ సంచలనం వైభవ్ సూర్యవంశీ ఊహించని విధ్వంసంతో సన్ రైజర్స్ కలలను ముక్కలు చేశాడు. ఆటగాళ్లు అద్భుతంగా రాణించినా దురదృష్టం వెంటాడటంతో ట్రోఫీ సాధించాలన్న హైదరాబాద్ ఆశలు కన్నీటితో ఆవిరైపోయాయి. ట్రోఫీ చేజారినా.. ఆరెంజ్ ఆర్మీ చూపించిన పోరాటం అభిమానుల గుండెల్లో ఎప్పటికీ నిలిచిపోతుంది.

**ఇదీ AI ముద్ర**



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శుక్రవారం 29.05.2026
www.mudranews.in | @mudranews



## బాదం పప్పుల ద్వారా పోషకాలు



కనీసం 12 గంటలు నానబెట్టండి:బాదం పప్పులను తిన డానికి ముందు 12 నుండి 24 గంటల పాటు నీటిలో నానబెట్టడం వల్ల వాటిలోని ఫైటిక్ ఆమ్లం పరిమాణం 50 శాతం వరకు తగ్గుతుంది.

## ప్రతి పౌరుడికి సమగ్ర
# సంక్షేమ కార్డ్

(మొదటి పేజీ తరువాయి)

సమగ్ర సంక్షేమ కార్డ్ ద్వారా రాష్ట్రంలోని ప్రతి పౌరుడి పూర్తి సంక్షేమ ప్రొఫైల్ ఒకేచోట అందుబాటులోకి వస్తుందని సీఎం అన్నారు. ఈ డేటాను అన్ని కోణాల్లో ఏఐ సహాయంతో విశ్లేషిస్తే సంక్షేమ పథకాల అమలులో పారదర్శకత పెరుగుతుందన్నారు. నిజమైన అర్హులకు పథకాలు మరింత ఖచ్చితంగా చేరుతాయన్నారు. అదే సమయంలో అనర్హులను గుర్తించడం సులభమవుతుందని అభిప్రాయపడ్డారు. ప్రతి శాఖ వేర్వేరుగా కార్డులు ఇచ్చే పద్ధతికి బదులు, ఐటీ శాఖ ఆధ్వర్యంలో సమగ్ర సంక్షేమ కార్డ్ ఉండాలని సీఎం సూచించారు. టెక్నాలజీపై పట్టున్న, చురుగ్గా పనిచేసే యువ ప్రభుత్వ అధికారులను ఈ ప్రక్రియకు వినియోగించాలని చెప్పారు. ఈ కార్డ్‌లో ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయ నిధి, ఫీజు రీయింబర్స్‌మెంట్, కార్మిక శాఖ, విద్యా శాఖ, ఇన్సూరెన్స్ పథకాలు, ప్రభుత్వం తీసుకువస్తున్న బీమా పథకాల వివరాలు ఉండాలని చెప్పారు. అవసరమైతే ఆధార్ నంబర్ తరహాలో రాష్ట్రస్థాయిలో ప్రత్యేక యూనిక్ ఐడెంటిటీ నంబర్ ఇచ్చేలా ఆలోచించాలన్నారు.

ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే వివరాలను కూడా ఈ కార్డ్‌కు అనుసంధానించాలన్నారు. లబ్ధిదారుల వివరాలతో పాటు వివిధ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్,





అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఖ్య, ఇతర వివరాలను సేకరించాలని ఐటీ శాఖను ఆదేశించారు. ఏఐ ఆధారిత ప్రొఫైలింగ్ ఉండాలని సీఎం సూచించారు ఎక్కడైనా మరణ ధృవీకరణ పత్రం జారీ అయితే, ఆ సమాచారం చేయూత పెన్షన్ డేటాబేస్‌కు చేరాలని, వెంటనే దాని ఆధారంగా చర్యలు మొదలయ్యేలా ఉండాలన్నారు. ప్రజల ఆరోగ్య ప్రొఫైల్‌ను కూడా సమగ్ర సంక్షేమ కార్డ్‌తో లింక్ చేయాలని చెప్పారు. కేరళ నుంచి గల్ఫ్‌కు వలస వెళ్లే ఉద్యోగులకు అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేయాలని సూచించారు. నైపుణ్యాభివృద్ధి, శిక్షణ కార్యక్రమాలతో పాటు, పాస్‌పోర్ట్‌లు, వీసాల జారీకి సంబంధించిన సమాచారం ఒకేచోట అందుబాటులో ఉంచితే, అనధికార ఏజెంట్ల ప్రమేయం తగ్గుతుందని తెలిపారు. పేదలకు సంక్షేమ ఫలాలు ఖచ్చితంగా చేరేలా, ప్రభుత్వం అమలు చేసే ప్రతి పథకం ప్రభావాన్ని అంచనా వేసేలా సమగ్ర సంక్షేమ కార్డ్ ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

## ఎన్టీఆర్‌కు భారతరత్న
# తెలుగువారి ఆకాంక్ష

**ముద్ర, అమరావతి:**

స్వర్గీయ నందమూరి తారక రామారావుకు భారతరత్న ఇవ్వాలని ప్రజలందరి ఆకాంక్ష అని సీఎం నారా చంద్రబాబు నాయుడు అన్నారు. మహానాడు రెండో రోజు కార్యక్రమంలో ఎన్టీఆర్‌కు నివాళిగా ప్రవేశపెట్టిన తీర్మానంపై మాట్లాడిన ఆయన, తెలుగు జాతి ఆత్మగౌరవానికి ప్రతీకగా ఎన్టీఆర్ నిలిచారని కొనియాడారు. దేశ రాజకీయాల్లో పెనుమార్పులకు నాంది పలికిన మహోన్నత నాయకుడిగా ఆయన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఎన్టీఆర్‌కు భారతరత్న ప్రకటించాలని మహానాడు ఏకగ్రీవంగా తీర్మానించిందన్నారు.

తెలుగు ప్రజల గుండెల్లో ఎన్టీఆర్ శాశ్వత స్థానం సంపాదించుకున్నారని చంద్రబాబు అన్నారు. సాధారణ సబ్‌రిజిస్ట్రార్ ఉద్యోగిగా జీవితాన్ని ప్రారంభించి, సినీరంగంలో విశ్వవిఖ్యాత నటసార్వభౌముడిగా ఎదిగి, ఆ తర్వాత రాజకీయాల్లో చరిత్ర సృష్టించారని గుర్తుచేశారు. పార్టీ స్థాపించిన తొమ్మిది నెలల్లోనే ముఖ్యమంత్రిగా అవతరించడం ఆయనకే సాధ్యమైందన్నారు. దేశ రాజకీయాల్లో ప్రాంతీయ పార్టీల ప్రాధాన్యతను పెంచి, కేంద్రంలో ప్రభుత్వాల ఏర్పాటులోనూ తెలుగుదేశం కీలక పాత్ర పోషించిందని తెలిపారు.



ఎన్టీఆర్ పాలన రైతులకు అండగా, మహిళలకు భరోసాగా, యువతకు దిక్సూచిగా నిలిచిందని చంద్రబాబు పేర్కొన్నారు. "సమాజమే దేవాలయం.. ప్రజలే దేవుళ్లు" అనే నినాదాన్ని ఆయన శాశ్వత సిద్ధాంతంగా మార్చారని చెప్పారు. మహిళలకు ఆస్తి హక్కులు కల్పించడం, యువతకు రాజకీయాల్లో అవకాశాలు ఇవ్వడం ఎన్టీఆర్ దూరదృష్టికి నిదర్శనమన్నారు. భవిష్యత్‌లోనూ పార్టీకి బలమైన నాయకత్వం అందేలా కార్యాచరణ కొనసాగుతోందని తెలిపారు. అలాగే చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కేంద్రాన్ని మరోసారి కోరారు.

## ఫ్యూచర్ సిటీలో భూములకు
# రికార్డు ధరలు


**ముద్ర, తెలంగాణ బ్యూరో:**

రాజధాని క్యూర్ పరిధిలో పెద్దపెద్ద వెంచర్లు చేపట్టడానికి అనువుగా ఉన్న భూములకు భారీగా డిమాండ్ పెరుగుతోంది. అందులోనూ ఎటువంటి వివాదాలు లేకుండా క్లియర్ టైటిల్ లతో ప్రభుత్వానికి చెందిన హౌసింగ్ బోర్డ్ స్థలాలకు డిమాండ్ మరింత భారీగా ఉంటోంది. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం, ఫ్యూచర్ సిటీ ఎంట్రన్స్ లో ఎయిర్ పోర్టుకు సమీపంలోని రావిర్యాలలో భూములను కొనుగోలు చేయడానికి అనేక మంది పోటీపడ్డారు. ఈ ప్రాంతలో ఉన్న హౌసింగ్ బోర్డు భూములకు గురువారం నాడు ఇ-ఆక్షన్ ద్వారా వేలం నిర్వహించారు. మొత్తం నాలుగు భూమలకు నిర్వహించిన వేలం పాటలో చదరపు గజం భూమి గరిష్టంగా రూ.83,500 కు అమ్ముడు పోయిందని హౌసింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ శ్రీ వి.పి.గౌతం తెలిపారు. వెయ్యి నుంచి 13,500 చదరపు గజాల విస్తీర్ణంలో ఉన్న నాలుగు లాండ్ పార్సిళ్లకు నిర్వహించిన వేలం ద్వారా సుమారు రూ. 140 కోట్ల ఆదాయం వచ్చిందని ఆయన తెలిపారు.

ఈ భూములను ఇ-ఆక్షన్ లో వేలం పాట ద్వారా విక్రయిస్తున్నట్లు గత నెలలో హౌసింగ్ బోర్డు నోటిఫికేషన్ ఇచ్చింది. ఈ భూములను కొనుగోలు చేయడానికి సుమారు 17 సంస్థలు పోటీ పడ్డాయి. ఇందులో 1113 చదరపు గజాల విస్తీర్ణంలో ఉన్న భూమిని కొనుగోలు చేయడానికి బిడ్డర్లు పోటీ పడ్డారు. రూ.26 వేల కనీసధరను నిర్ధారించగా, దీనిని దక్కించుకోడానికి పోటీ పడుతూ చదరపు గజం రూ. 83,500 కు ఒక డెవలపర్ సంస్థ దక్కించుకుంది. అలాగే ఇదే ప్రాంతంలోని సుమారు 6 వేల చదరపు గజాల విస్తీర్ణంలోని భూమి వేలం పాటలో చదరపు గజం రూ.62,500 ధరకు అమ్ముడు పోయింది. అంతే కాకుండా సుమారు 13,500 చదరపు గజాల విస్తీర్ణంలోని భూమిని కొనుగోలు చేయడానికి కూడా బిడ్డర్లు పోటీ పడ్డారు. ఈ నాలుగు భూముల వేలం ద్వారా హౌసింగ్ బోర్డుకు సుమారు రూ. 140 కోట్ల మేర ఆదాయం వచ్చింది.

**నేడు కూడా భూముల విక్రయాలు**

కెపిహెచ్ బి కాలనీ, కుత్బుల్లాపూర్ చింతల్ ప్రాంతాల్లోని మరో 4 ప్లాట్లకు (భూములకు) శుక్రవారం నాడు ఇ-ఆక్షన్ నిర్వహిస్తున్నారు. కేపీహెచ్బీ కాలనీ ఫేజ్ 1-2 లోని 5,898 చదరపు గజాలు, 2,420 చదరపు గజాల్లోని ప్లాట్ నెం. 2, కుత్బుల్లాపూర్ చింతల్ లోని 10,890 చదరపు గజాలు, 3,388 చదరపు గజాల భూములను వేలం ద్వారా విక్రయించనున్నారు.



# కర్ణాటకలో కొత్త అధ్యాయం..

(మొదటి పేజీ తరువాయి)

రాజీనామా అనంతరం మీడియాతో మాట్లాడిన సిద్ధరామయ్య భావోద్వేగానికి గురయ్యారు. కాంగ్రెస్ హైకమాండ్ నిర్ణయాన్ని గౌరవిస్తూ తాను ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. సోనియా గాంధీ, మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. "పార్టీ ఏ బాధ్యత అప్పగించినా చిత్తశుద్ధితో నిర్వర్తిస్తాను" అని స్పష్టం చేశారు. తన ప్రభుత్వానికి మూడేళ్ల పాటు సహకరించిన మంత్రులు, ఎమ్మెల్యేలకు ధన్యవాదాలు తెలిపారు. సిద్ధరామయ్య ప్రసంగంలో పవర్ షేరింగ్ ఒప్పందానికి సంబంధించిన సంకేతాలు కనిపించాయి. కాంగ్రెస్‌లో ముందుగా కుదిరిన అవగాహన మేరకే ఈ మార్పు జరుగుతోందన్న చర్చ రాజకీయ వర్గాల్లో బలంగా వినిపిస్తోంది.

**డీకే శివకుమార్‌కు గ్రీన్ సిగ్నల్**

సిద్ధరామయ్య రాజీనామాతో డీకే శివకుమార్‌కు సీఎం పీఠం దక్కే మార్గం పూర్తిగా సుగమమైంది. ఉదయం జరిగిన బ్రేక్‌ఫాస్ట్ సమావేశంలోనే సిద్ధరామయ్య తన నిర్ణయాన్ని కీలక నేతలకు వెల్లడించినట్లు సమాచారం. ఈ సందర్భంగా డీకే శివకుమార్ సిద్ధరామయ్య పాదాలకు నమస్కరించి ఆశీర్వాదం తీసుకోవడం సభలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మే 29 సాయంత్రం జరగనున్న కాంగ్రెస్ శాసనసభా పక్ష సమావేశంలో డీకే శివకుమార్‌ను అధికారికంగా సీఎల్పీ నేతగా ఎన్నుకోనున్నారు. అనంతరం గవర్నర్‌ను కలిసి ప్రభుత్వ ఏర్పాటు దావా చేయనున్నారు. రెండు రోజుల్లో ఆయన ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి.

**జాతీయ రాజకీయాల్లోకి సిద్ధరామయ్య?**

సిద్ధరామయ్యను జాతీయ రాజకీయాల్లో కీలకంగా ఉపయోగించుకోవాలని కాంగ్రెస్ అధిష్టానం భావిస్తున్నట్లు



సమాచారం. ఆయనకు రాజ్యసభ సభ్యత్వంతో పాటు ఏఐసీసీలో కీలక బాధ్యతలు అప్పగించే అవకాశముందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అయితే ప్రస్తుతం తాను రాష్ట్ర రాజకీయాల్లోనే కొనసాగాలనే అభిప్రాయంతో ఉన్నట్లు ఆయన సన్నిహితులు వెల్లడిస్తున్నారు. 43 ఏళ్ల రాజకీయ ప్రస్థానంలో సిద్ధరామయ్య రెండుసార్లు కర్ణాటక ముఖ్యమంత్రిగా పనిచేశారు. తన సోషల్ ఇంజనీరింగ్ రాజకీయాలతో వెనుకబడిన వర్గాల్లో బలమైన మద్దతు సంపాదించుకున్నారు. రైతులు, మధ్యతరగతి, పేదల కోసం అమలు చేసిన పథకాలతో గుర్తింపు తెచ్చుకున్నారు.

**కాంగ్రెస్‌లో కొత్త దశ**

సిద్ధరామయ్య నిష్క్రమణతో కర్ణాటక కాంగ్రెస్‌లో ఒక శకం ముగిసిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇక డీకే శివకుమార్ నాయకత్వంలో పార్టీ కొత్త దిశగా ప్రయాణించనుంది. ఆర్గనైజేషనల్ బలం, వ్యూహాత్మక రాజకీయాలతో పేరుగాంచిన శివకుమార్ పాలనలో ప్రభుత్వం ఎలాంటి మార్పులు తీసుకువస్తుందన్న ఆసక్తి రాష్ట్ర వ్యాప్తంగా నెలకొంది. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ అంతర్గత సమీకరణాలు, మంత్రివర్గ కూర్పు, పాలనా శైలి కర్ణాటక రాజకీయాలపై కీలక ప్రభావం చూపనున్నాయి.

# సరిహద్దుకు షా..



**ముద్ర డెస్క్:**

ప్రధానమంత్రి నరేంద్ర మోడీతోపాటు.. కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా రంగంలోకి దిగి మనదేశం లో ఉన్న 15 రాష్ట్రాల సరిహద్దులను పర్యవేక్షిస్తున్నారు. అక్కడ ఏకంగా కంచెలు నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. అంతే కాదు ఒక హై లెవెల్ కమిటీని కూడా ఏర్పాటు చేశారు. ఈ హై లెవెల్ కమిటీ అన్ని రాష్ట్రాలలో జనాభా లెక్కలను పరిశీలిస్తుంది. ఒక మతంలో అధికంగా పెరుగుదల ఉంటే.. అది ఎందు కు సాధ్యమైందో లోతుగా విశ్లేషణ చేస్తుంది. ఆ తర్వాత తీసుకోవాల్సిన చర్యల గురించి ప్రభుత్వానికి నివేదిక అందిస్తుంది. ఇప్పటికే హోమ్ మినిస్టర్ అమిత్ షా రాజస్థాన్ లోని బికనీర్ ప్రాంతంలో పర్యటించారు. అక్కడ సరిహద్దులను పరిశీలించారు. మరోవైపు అస్సాం, త్రిపుర ప్రాంతాలలో ఇప్పటికే బంగ్లా దేశ్ నుంచి అక్రమంగా వచ్చిన వారిని బయటికి పంపించారు. పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో కూడా పంపిస్తున్నారు. మిగతా ప్రాంతాలలో కూడా ఇదే విధానాన్ని అనుసరిస్తారని తెలుస్తోంది. సరిహద్దు రాష్ట్రాల్లో అమిత్ షా పర్యటించడం.. కంచె నిర్మాణాలు చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్న నేపథ్యంలో.. ఇకపై చొర బాట్లు.. అక్రమ కార్యకలాపాలకు తావుండదని జాతీయ వాదులు చెబుతున్నారు.

## హైదరాబాద్ రియల్
# ఎస్టేట్ రికార్డు

(మొదటి పేజీ తరువాయి)

చదరపు అడుగుకు భారీ అద్దెలు వస్తుండటంతో పెట్టుబడిదారులు వందల కోట్లు వెచ్చించి భూములు కొనుగోలు చేస్తున్నారు.

**ప్రభుత్వానికి భారీ ఆదాయం**

రాయదుర్గంలోని పాన్ మక్తా ప్రాంతం, సర్వే నెంబర్ 83/1లో ఉన్న 6 ఎకరాల 29 గుంటల భూమిని టీజీఐఐసీ వేలం వేస్తోంది. ఈ వేలంలో ఎకరం ధర రూ. 237 కోట్లకు చేరుకోవడం విశేషం. గత ఏడాది ఇదే ప్రాంతంలో 7.6 ఎకరాలను ప్రభుత్వం వేలం వేయగా ఎకరం రూ.177 కోట్ల ధర పలికింది. అప్పట్లో ప్రభుత్వానికి రూ.1357.59 కోట్ల ఆదాయం వచ్చింది. ఇప్పుడు మరింత అధిక ధర రావడంతో ప్రభుత్వ ఖజా నాకు భారీ ఆదాయం సమకూరే అవకాశముంది.

**రియల్ ఎస్టేట్ హాట్ స్పాట్స్‌గా మారిన ప్రాంతాలు**

రాయదుర్గం మాత్రమే కాదు.. మంచిరేవుల, నార్సింగి, కోకాపేట, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, నేక్నాంపూర్ ప్రాంతాల్లో కూడా భూముల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ఈ ప్రాంతాల్లో ఎకరం రూ.100 కోట్లకు పైగా పలుకుతోంది. ఔటర్ రిం గ్ రోడ్ చుట్టుపక్కల ఐటీ కంపెనీలు, ఫార్మా సంస్థలు, ఫైనాన్షియల్ కంపెనీ లు కార్యకలాపాలు విస్తరించడంతో ఉద్యోగులు శాశ్వత నివాసాల కోసం ఇక్కడికి పెద్దఎత్తున వస్తున్నారు. దీంతో భారీ నివాస సముదాయాలకు డిమాండ్ పెరిగింది. రాజ్ పుష్ప, అపర్ణ, మై హోం, జనప్రియ వంటి ప్రముఖ సంస్థలు వేల కోట్లతో భారీ టౌన్‌షిప్‌లు, కమర్షియల్ ప్రాజెక్టులు నిర్మిస్తున్నాయి. భవిష్యత్‌లో కూడా హైదరాబాద్‌లో గ్లోబల్ కంపెనీల పెట్టుబడులు పెరిగే అవకాశముందని అంచనా వేస్తున్నారు.

**దేశం చూపు హైదరాబాద్ వైపు**

ముంబై, చెన్నై, కోల్కతా, పూణే వంటి మెట్రో నగరాలతో పోటీ పడుతూ హైదరాబాద్ ఇప్పుడు రియల్ ఎస్టేట్ రంగం లో కొత్త ప్రమాణాలు సృష్టిస్తోంది. ఎక రం రూ.237 కోట్లు పలకడం కేవలం రికార్డు మాత్రమే కాదు.. హైదరాబాద్ ఆర్థిక బలం, పెట్టుబడుల సామర్థ్యం, భవిష్యత్ అవకాశాలకు నిదర్శనంగా మారింది.

# అమెరికాకు సినిమా చూపించిన మోడీ

ముద్ర డెస్క్ :

అమెరికా ముందు వంగిపోయాడు. అమెరికా ముందు లొంగిపోయాడు. అమెరికా చెబితే భయపడిపోయాడు.. ఇదిగో ఇలా సాగిపోతుంటాయి నరేంద్ర మోడీ గురించి రాహుల్ గాంధీ చేసే విమర్శలు. కానీ రాహుల్ గాంధీ.. మిగతా ప్రతిపక్ష పార్టీల నాయకులు తెలుసుకోవాల్సింది ఒకటుంది. ఈ దేశానికి ప్రధానమంత్రి అయిన తర్వాత నరేంద్ర మోడీ విదేశాంగ విధానంలో సరికొత్త మార్పులు తీసుకొచ్చారు. భారత్ అంటే చాలు తల ఎగిరిసే దేశాలను సైతం కాళ్ళ కిందికి తెచ్చుకున్నారు. అందువల్లే అది నచ్చని రాహుల్ గాంధీ.. ఇంకా మిగతా నాయకులు నరేంద్ర మోడీ మీద విమర్శలు చేస్తుంటారు.

తాజాగా అమెరికా విదేశాంగ శాఖ మంత్రి రూబీయో ఇండియాకు వచ్చారు. ఇక్కడ రెండు రోజులపాటు ఉన్నారు. రకరకాల సమావేశాలలో పాల్గొన్నారు. కనీసం ఆయనకు ఇండియన్ గవర్నమెంట్ మామూలు వెల్కమ్ కూడా చెప్పలేదు. సీఐ స్థాయి పోలీసు అధికారులతో ఆయనకు వెల్కమ్ చెప్పించింది. ప్రధాని వెళ్లలేదు. విదేశాంగ శాఖ మంత్రి కూడా వెళ్లలేదు. ఆ శాఖలో పనిచేసే అధికారులు కూడా వెళ్లలేదు.

చివరికి దేశాన్ని వీడి అమెరికాకు వెళ్తున్న సమయంలో కూడా ఘనమైన వీడ్కోలు లభించలేదు. వీడ్కోలు సమయంలో కూడా సీఐ స్థాయి అధికారితోనే భారత్ సెండాఫ్ ఇచ్చింది. మన దేశంలో ఉన్నప్పుడు కూడా చెప్పుకునే స్థాయిలో గౌరవ మర్యాదలు ఇవ్వలేదు భారత్. ఇటీవల కాలంలో ట్రంప్ భారత్ మీద రకరకాల వ్యాఖ్యలు చేశాడు. అందువల్లే భారత్ ఇలా రివెంజ్ తీర్చుకుంది. ఇప్పట్లో ట్రంప్ ఇండియా జోలికి రాడు. ఇండియా గురించి మాట్లాడలేదు.. ఇటీవల చైనా టూర్ కు వెళ్ళినప్పుడు కూడా అమెరికా అధినేత ట్రంప్ కు ఈ స్థాయిలో పరాభవం ఎదురు కాలేదు.

## కేసీఆర్‌కు రాజకీయ
# భిక్ష పెట్టిందెవరు?

**ముద్ర హైదరాబాద్ :**

దేశం గర్వించదగిన గొప్ప నేత ఎన్టీఆర్ అని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఎన్టీఆర్, ఇందిరాగాంధీ స్ఫూర్తితో తమ ప్రభుత్వం పాలన కొనసాగిస్తోందని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తమకు ఇందిరాగాంధీ ఎంత ముఖ్యమో.. ఎన్టీఆర్ కూడా అంతే ము ఖ్యమని చెప్పారు. అమీర్‌పేట మైత్రీవనం సర్కి ల్‌లో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన అనం తరం నిర్వహించిన కార్యక్రమంలో రేవంత్ రెడ్డి మాట్లాడారు. 'దేశ చరిత్రను ఎవరూ చదవాలన్నా, స్ఫూర్తి పొందాలన్నా ముగ్గురు జాతి రత్నాలను స్మరించుకోవాలి. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మాజీ ప్రధాని ఇందిరాగాంధీ, మా జీ సీఎం ఎన్టీఆర్ జాతిరత్నాలు. నిరంతరం వారి కీర్తి ప్రతిష్ఠలు, నిర్ణయాలను గుర్తుచేసుకోవాలి. అంబేడ్కర్.. పురుషులతో సమానంగా మహిళలకు ఓటు హక్కు కల్పించారు. ఇం దిరాగాంధీ.. భారత్‌ను ప్రపంచ దేశాల ముందు తలెత్తుకునేలా చేశారు. భూసంస్కరణలతో పేదలకు ఎంతో లబ్ధి చేకూర్చారు. తెలుగుజాతిలో స్ఫూర్తి నింపిన నేత ఎన్టీఆర్. బడుగు, బలహీనవర్గాల కోసం కార్యక్రమాలు అమలు చేశారు.

కాంగ్రెస్ సీఎం, పీసీసీ చీఫ్ ఎన్టీఆర్ విగ్రహాన్ని ఎలా ఆవిష్కరిస్తారని కొందరు ప్రశ్నిస్తున్నారు. కులమతాలు, ప్రాంతాలు, భాషలకు అతీతంగా దేశం గర్వించదగిన నాయకుడు ఎన్టీఆర్. అందుకే ఆయన విగ్రహాన్ని హైదరాబాద్ నడిబొడ్డులో ఆవిష్కరించుకున్నాం. నాకు జీవితకాలం గుర్తుండిపోయే మధుర జ్ఞాపకం. ఈ విషయంలో ఎవరు ఎలాంటి విమర్శలు చేసి నా భయపడను.



ఆనాడు ఇందిరాగాంధీ.. తెలంగాణ ప్రాంతం నుంచి పీవీ నరసింహారావు, మర్రి చెన్నారెడ్డి, వెంకటస్వామి లాంటి నేతలను అందించారు. ఎన్టీఆర్.. తెలంగాణ ప్రాంతానికి తుమ్మల నాగేశ్వరరావు, మండవ వెంకటేశ్వరరావు, కడియం శ్రీహరి, దేవేందర్ గౌడ్, మోత్కుపల్లి లాంటి నాయకులను అందించారు. కేసీఆర్‌కు రాజకీయ భిక్ష పెట్టింది ఎవరు? ఎన్టీఆర్ నీడన బతికిన మీరు ఆయన్ను తక్కువ చేసి మాట్లాడటం సమంజసమా? ఎన్టీ ఆర్ లేకుండానే నాయకులయ్యారా? ఆయన ఆశీర్వాదంతోనే పాలితులుగా ఉన్న ఎంతో మంది పాలకులయ్యారు. గ్రామాల్లో పటేల్ పట్వారీ వ్యవస్థను రద్దు చేసి పేదలకు విముక్తి కల్పిం చారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
శుక్రవారం 29.05.2026
www.mudranews.in | @mudranews



**బాదం పప్పుల ద్వారా పోషకాలు**



పొట్టు తీసి (తొక్క తీసి) తినండి:రాత్రంతా నానిన బాదం పప్పుల పైపొట్టును మరుసటి రోజు ఉదయం పూర్తిగా తొలగించి తినడం వల్ల జీర్ణ ప్రక్రియ చాలా సులభతరం అవుతుంది.

కోట్లాది రూపాయల పనులకు

## శ్రీకారం చుట్టిన డిప్యూటీ సీఎం



**ముద్ర ప్రతినిధి, ఖమ్మం:** మధిర నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. గురువారం ఎర్రుపాలెం మండలంలో విస్తృతంగా పర్యటించిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క రహదారులు, విద్యుత్ సబ్ స్టేషన్లు, ఆలయ పునర్నిర్మాణ పనులకు వరుస శంకుస్థాపనలు చేశారు.సుమారు 110 కోట్ల రూపాయలకు పైగా అంచనా వ్యయంతో చేపట్టనున్న ఈ పనులకు శంకుస్థాపన చేశారు. ప్రధాన రహదారులతో పాటు మారుమూల గ్రామాల అనుసంధానానికి ప్రాధాన్యతనిస్తూ డిప్యూటీ సీఎం పలు బీటీ రోడ్డు పనులకు భూమి పూజ నిర్వహించారు.మండలంలోని పలు గ్రామాలలోని ఎస్సీ కాలనీల్లో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణానికి ఉప ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు.మండలంలో విద్యుత్ సరఫరాను మెరుగుపరిచేందుకు రెండు భారీ సబ్ స్టేషన్ల నిర్మాణానికి భట్టి విక్రమార్క శ్రీకారం చుట్టారు.ములుగుమాడు గ్రామంలోని శ్రీ రామాలయ ప్రాంగణంలో రూ. 90 లక్షల అంచనాలతో చేపట్టనున్న భక్తాంజనేయ స్వామి ఆలయ పునర్నిర్మాణ పనులకు డిప్యూటీ సీఎం శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ, నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి అత్యుత్తమ మౌలిక సదుపాయాలు కల్పించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. నిధుల కొరత లేకుండా పనులు వేగంగా పూర్తి చేస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర్, సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ, డిసిసి వైస్ ప్రెసిడెంట్ వేమిరెడ్డి సుధాకర్ రెడ్డి స్థానిక నాయకులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

అకాల వర్షా లను సైతం..

## మీ రాజకీయాలకు వాడుకోవద్దు

**అది'రైతు గోస' కాదు.. అధికారం కోసం బీజేపీ నాయకుల 'రాజకీయ ఘోష'**
**ప్రజల్ని తప్పుదోవ పట్టించేలా బీఆర్ఎస్ డైవర్షన్ పాలి'ట్రిక్స్'**
**ధాన్యం కొనుగోళ్లపై ప్రతిపక్షాల దుష్ప్రచారం**
**మంత్రి శ్రీధర్ బాబు ఫైర్**



**ముద్ర, హైదరాబాద్ :** అకాల వర్షాలనూ మీ రాజకీయాల కోసం వాడుకోవద్దని ప్రతిపక్షాలకు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చురకలంటించారు. పన్నెండేళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉండి రైతుల ఆదాయం రెట్టింపు చేయకపోగా ఎరువుల ధరలు పెంచి, నల్ల చట్టాలతో తీవ్ర అన్యాయం చేసిన బీజేపీ, ఇవాళ తెలంగాణలో ' రైతు గోస – బీజేపీ భరోసా' పేరిట పొలిటికల్ యాత్రలు చేస్తోందని ఓ ప్రకటనలో విమర్శించారు. అది 'రైతు గోస' కాదని, అధికారం కోసం బీజేపీ నాయకులు పెడుతున్న 'రాజకీయ ఘోష' అని మండిపడ్డారు. స్వామినాథన్ కమిటీ సిఫార్సులను పూర్తిస్థాయిలో అమలు చేయకుండా అన్నదాతలకు అన్యాయం చేస్తుందెవరో ముందు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. నాడు తెలంగాణలో పండిన ధాన్యాన్ని కొనుగోలు చేయమని అడగటానికి వెళితే మీ వాళ్లకు నూకలు తినటం అలవాటు చేయండంటూ అవమానించిన మీ కేంద్ర మంత్రుల చరిత్రను మర్చిపోయారా? అని బీజేపీ నాయకులను ప్రశ్నించారు. అప్పట్లో మన రైతుల పక్షాన నిలబడకుండా ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తున్నారా అంటూ ఎద్దేవా చేశారు. నిజంగా రైతులపై ప్రేమ ఉంటే ఇక్కడ పొలిటికల్ టూర్లు చేస్తూ కాలక్షేపం చేయొద్దని హితవు పలికారు. ఢిల్లీకి వెళ్లి కేంద్రంపై ఒత్తిడి తెచ్చి తెలంగాణ రైతాంగానికి న్యాయంగా రావాల్సిన హక్కులను, నిధుల్ని సాధించుకురావాలని సూచించారు. ప్రకృతి వైపరీత్యాలు తలెత్తినప్పుడు రైతాంగానికి ధైర్యం చెప్పి, బాధ్యతాయుతమైన ప్రతిపక్షంగా అన్నదాతలకు అండగా నిలవాల్సిన బీఆర్ఎస్, ఆ పని పక్కనబెట్టి, కేవలం రాజకీయ ఉనికి కోసం ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేయడమే లక్ష్యంగా పెట్టుకోవడం సిగ్గుచేటన్నారు. క్షేత్రస్థాయిలో పారదర్శకంగా, రికార్డు స్థాయిలో కొనుగోళ్లు జరుపుతుంటే, ప్రజల్ని తప్పుదోవ పట్టించేలా డైవర్షన్ పాలి'ట్రిక్స్' చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రతిపక్షాలు ఎన్ని ఆటంకాలు సృష్టించినా, ఎన్ని కుట్రలు చేసినా చివరి గింజ కొనే వరకు అన్నదాతలకు ప్రభుత్వం అండగా ఉంటుందని స్పష్టం చేశారు. బీజేపీ, బీఆర్ఎస్ నాయకుల దుష్ప్రచారాన్ని నమ్మి ఆందోళనకు గురి కావొద్దని రైతులకు విజ్ఞప్తి చేశారు.

# ధాన్యం చివరి గింజ వరకు కొనుగోలు చేస్తాం

**రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ధాన్యం కొనుగోళ్లను పరిశీలించిన మంత్రుల బృందం**



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** రైతులు పండించిన ధాన్యాన్ని చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ధాన్యం కొనుగోళ్లపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రైతుల కోసం ప్రభుత్వం పూర్తిస్థాయిలో అండగా ఉంటుందని, ఎలాంటి ఆర్థిక పరిస్థితులు ఎదురైనా ధాన్యం కొనుగోలు ఆపబోమన్నారు. అకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తామని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తామని తెలిపారు.ధాన్యం సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని రెవెన్యూ, సివిల్ సప్లై, పోలీస్ శాఖలకు సూచించారు. పంట కొనుగోలు, అన్‌లోడింగ్ పనుల కోసం కొన్ని రోజుల పాటు ఇసుక వాహనాలను వినియోగించుకోవాలని అధికారులకు సూచించారు. యాసంగి సీజన్‌లో రికార్డు స్థాయిలో పంట దిగుబడి వచ్చిందని, ధాన్యాన్ని జాగ్రత్తగా గోదాములకు తరలించాలని రైతులకు సూచించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఈసారి వరి దిగుబడి అద్భుతంగా వచ్చిందని, మద్దతు ధర ప్రకారం ధాన్యం కొనుగోలు చేస్తూ రైతుల ఖాతాల్లో భారీ మొత్తంలో డబ్బులు జమ చేస్తున్నామని చెప్పారు. తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల పక్షాన నిలుస్తోందని, రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేస్తామని పేర్కొన్నారు.జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు 2,75,686.220 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు కొనసాగుతున్నాయని చెప్పారు. అంతకు ముందు మంత్రులు యాదగిరిగుట్ట మండలం వంగపల్లిలోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రం, రామజీపేట గోదామును పరిశీలించారు.

## రైతులు ఆందోళన చెందవద్దు



**ముద్ర, పెద్దపల్లి:** యాసంగి సీజన్‌లో రైతులు పండించిన వరి ధాన్యాన్ని మారుమూల గ్రామాల్లోనూ చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. అకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని కూడా మద్దతు ధరకు కొనుగోలు చేసి బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలిస్తామని రైతులకు హామీ ఇచ్చారు.గురువారం పెద్దపల్లి జిల్లాలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్తో కలిసి పర్యటించారు. ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రమణారావు, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్, భూపాలపల్లి ఎమ్మెల్యే సత్యనారాయణ రావు కూడా పాల్గొన్నారు.ఈ సందర్భంగా పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్‌లోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంత్రులు పరిశీలించారు. అనంతరం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 8,885 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.యాసంగి సీజన్‌లో ఇప్పటివరకు రాష్ట్రంలో 58 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, ఇంకా 17 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉందన్నారు. ఇప్పటి వరకు 8 లక్షల మంది రైతులకు రూ.11 వేల కోట్లు చెల్లించినట్లు వెల్లడించారు.భారతదేశంలో ఎక్కడా లేనివిధంగా తెలంగాణలో రికార్డు స్థాయిలో ధాన్యం, మక్కలు కొనుగోలు చేశామని మంత్రి పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర మేరకు రాష్ట్రంలో 75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించగా, కేంద్రం మాత్రం 51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే సేకరించిందన్నారు. మిగిలిన 25 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేసిందని వివరించారు.డిసెంబర్ 2023 తర్వాత కేంద్రం ప్రకటించిన మద్దతు ధరకు అదనంగా రూ.16,470 కోట్లు చెల్లించి రైతుల వద్ద నుంచి ధాన్యం కొనుగోలు చేసినట్లు మంత్రి తెలిపారు. వరి ధాన్యం కొనుగోలు పూర్తయ్యే వరకు ఇసుక క్వారీల కార్యకలాపాలు నిలిపివేసి, ఇసుక లారీలను ధాన్యం రవాణాకు వినియోగించాలని అధికారులను ఆదేశించారు.పెద్దపల్లి జిల్లాలో ధాన్యం సేకరణలో చొరవ చూపిన అధికారులు, మిల్లర్లు, ప్రజాప్రతినిధులను మంత్రి అభినందించారు.

# ప్రపంచానికే తలమానికంగా "ఫ్యూచర్ సిటీ"

**ప్రపంచ స్థాయి గ్లోబల్ సిటీ నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యం**
**ఎఫ్ సి డి ఏ కార్యాలయం, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ నిర్మాణ పనులను పరిశీలించిన మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, శ్రీధర్ బాబు**



**ముద్ర, తెలంగాణ బ్యూరో :** ఫ్యూచర్ సిటీ నిర్మాణం ప్రపంచానికే తలమానికంగా ఉండేలా జరుగుతోందని రాష్ట్ర మంత్రులు శ్రీనివాస్ రెడ్డి, డి .శ్రీధర్ బాబు తెలిపారు. గురువారం రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో కలిసి ప్రతిష్టాత్మక "ఫ్యూచర్ సిటీ" ప్రాజెక్టు ప్రాంతంలో పర్యటించి నిర్మాణంలో ఉన్న ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కార్యాలయ భవనం, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ నిర్మాణ పనులను పరిశీలించి అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, శ్రీధర్ బాబు మాట్లాడుతూ... తమ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "ఫ్యూచర్ సిటీ" ప్రాజెక్టును ప్రపంచ స్థాయి గ్లోబల్ సిటీగా తీర్చిదిద్దే దిశగా వేగంగా ముందుకు సాగుతోందన్నారు. ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కార్యాలయ ప్రారంభోత్సవాన్ని కి సంబంధించిన తేదీల పై గౌరవ ముఖ్యమంత్రి గారితో చర్చించి త్వరలో నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఫ్యూచర్ సిటీలో తీసుకునే ప్రతి నిర్ణయం, ప్రతి నిర్మాణం అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణతో పనిచేస్తోందన్నారు. ప్రస్తుతం వేస్తున్న పునాదులు రాబోయే తరాలకు ఆధునిక తెలంగాణ నిర్మాణానికి నాంది పలుకుతాయని పేర్కొన్నారు. భవిష్యత్తులో ప్రపంచవ్యాప్తంగా ప్రభావం చూపే నగరంగా ఫ్యూచర్ సిటీ ఎదగాలన్నదే ప్రభుత్వ సంకల్పమని తెలిపారు. ఇప్పటికే పోలీస్ కమిషనరేట్ ఏర్పాటు ప్రక్రియ ప్రారంభమైందని చెప్పారు. గ్లోబల్ ప్రెజెన్స్ కలిగిన అనేక ప్రభుత్వ కార్యాలయాలను కూడా ఇక్కడి నుంచే నిర్వహించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని వెల్లడించారు.యువతకు ప్రపంచ స్థాయి నైపుణ్యాలు అందించాలనే లక్ష్యంతో "యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ" ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తమ ప్రభుత్వం ఫ్యూచర్ సిటీ నిర్మాణాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని వేగవంతంగా ముందుకు తీసుకెళ్తోందన్నారు. ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ఎదురైన అనేక సవాళ్లను అధిగమిస్తూ ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో చిత్తశుద్ధితో పనిచేస్తోందని పేర్కొన్నారు.ఫ్యూచర్ సిటీ తెలంగాణకే కాకుండా దేశానికే తలమానికంగా నిలిచే ప్రాజెక్టుగా రూపుదిద్దుకుంటోందని, ఈ ప్రాజెక్టు ద్వారా లక్షలాది యువతకు ఉపాధి అవకాశాలు, ఉద్యోగ భద్రత కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రపంచంలోని అనేక దేశాలు, రాష్ట్రాలు సైతం ఆలోచించని విధంగా తెలంగాణ అభివృద్ధికి ప్రభుత్వం వినూత్న కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు.ప్రస్తుతం తాత్కాలిక క్యాంపస్‌లో కొనసాగుతున్న యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీకి శాశ్వత క్యాంపస్ నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని, పనుల పురోగతిని సమీక్షించి అవసరమైన నిర్ణయాలు తీసుకుని నిర్మాణాన్ని మరింత వేగవంతం చేస్తామని తెలిపారు.అనంతరం మంత్రులు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ నిర్మాణ పనులను ప్రత్యక్షంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కమిషనర్ కె. శశాంక, మహేశ్వరం డీసీపీ కె. నారాయణ రెడ్డి, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# రైతుల కంట్లో కన్నీరు

**- ధాన్యం కొనలేని స్థితిలో కాంగ్రెస్ సర్కార్ - కురిసిన వర్షా లకు తడిసిన ధాన్యం కొనాలి**
**- రేవంత్ ప్రభుత్వం లో రైతులకు ఆవేదనే మిగిలింది - ధాన్యం కొనుగోలులో సర్కార్ విఫలం**
**- మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్**



**ముద్ర, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి:** రేవంత్ సర్కార్ అసమర్థ పాలన లో రైతాంగం కుదేలై బక్కచిక్కి పోయిందని, పండించిన ధాన్యం కొనుగోలు లో ప్రభుత్వ నిర్లక్ష్యధోరణి వ్యవహరించడం తో రైతులు కళ్లాల్లో కన్నీరు వస్తున్నదని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ మండిపడ్డారు. గురువారం మహబూబ్ నగర్ మండల పరిధిలోని రైస్ మిల్లులల్లో ధాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.ధాన్యం పండించిన రైతుల నుంచి కొనుగోలు చేయడం లో రేవంత్ సర్కార్ పూర్తిగా విఫలం చెందిందన్నారు. ధాన్యం కొనుగోలు కాకపోవడంతో రైతులను కదిలిస్తే కన్నీళ్లు పెట్టుకుంటున్నారన్నారు.ప్రభుత్వం పంట కొనుగోలు చేయకపోవడంతో వర్షానికి పంట తడిసిందన్నారు.తడిసిన ధాన్యం కొనుగోలు చేస్తామని ప్రభుత్వం చెబుతున్నదని,కానీ మంచిగా ఉన్న ధాన్యం కూడా కొనలేని పరిస్థితి లో ప్రభుత్వం ఉందన్నారు. క్షేత్ర స్థాయిలో వాస్తవాలను ప్రభుత్వం తెలుసుకోవాలన్నారు. రోహిణి కార్తె రావడంతో పంటలు వేసుకునేందుకు రైతులు సిద్ధం అవుతుంటే కనీసం ఎరువులు కూడా అందుబాటులో లేవన్నారు.రైతు బంధు లేదు.. రుణ మాఫీ లేదు.. సకాలంలో కరెంటు ఇవ్వలేదు.. ఆరుగాలం కష్టం చేసి పండిన పంట కొనుగోలు చేయని అసమర్థ ప్రభుత్వం అని ఆయన విమర్శించారు.పాలమూరు, రంగారెడ్డి ప్రాజెక్టు పనులు పూర్తి చేసేందుకు పిలిచినా టెండర్లు కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసిందన్నారు.ప్రాజెక్ట్ పూర్తి చేయమంటే మంత్రులు తప్పుడు మాటలు మాట్లాడుతున్నారు.నాసిరకం పత్తి విత్తనాలను మార్కెట్ లో రాకుండా అధికారులు నిఘా పెంచాలన్నారు.ఇచ్చిన హామీలు అమలు చేయాలని,రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పంటలు కొనుగోలు చేయడంతో పాటు ఎరువులు సకాలంలో ఇవ్వాలనిఆయన డిమాండ్ చేశారు. కెసిఆర్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు రైతులకు ఏ ఇబ్బందులు లేకుండా పంట కొనుగోలు చేశామన్నారు.రైతు బంధు సకాలంలో విడుదల చేసామని,కాంగ్రెస్ వచ్చి రెండున్నర యేండ్లు ఐన రైతులకు చేసిందేమి లేదన్నారు. ఇదే రకమైన పాలనా కొనసాగితే రైతుల పక్షాన పోరాటం చేస్తామని ఆయన హెచ్చరించారు.అనంతరం ఈద్గా వద్దకు వెళ్లి ముస్లిం సోదరులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. సురవరం సుధాకర్ రెడ్డి జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి నివాళ్లర్పించారు.మాజీ మంత్రి వెంట గ్రంధాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజేశ్వర్ గౌడ్, మండల సీనియర్ నాయకులు మల్లు నర్సింహా రెడ్డి, రాజేశ్వర్ రెడ్డి, రాఘవేందర్ గౌడ్ తదితరులు ఉన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శుక్రవారం 29.05.2026
www.mudranews.in | @mudranews



### బాదం పప్పుల ద్వారా పోషకాలు

నానబెట్టిన తర్వాత శుభ్రంగా కడగండి. బాదంను నానబెట్టిన తర్వాత నీటిని పారబోసి, పప్పులను పూర్తిగా కడగాలి. దీనివల్ల ఎంజైమ్ నిరోధకమైన ఫైటిక్ ఆమ్లం పూర్తిగా తొలగి పోతుంది.



# కాళేశ్వరం పుష్కరాలలో ఉట్టిపడుతున్న ఆధ్యాత్మిక వైభవం

**మహాదేవపూర్, ముద్ర:** సరస్వతి అంత్య పుష్కరాలతో కాళేశ్వరం సరికొత్త కాంతులీనుతోంది. కనీవిని ఎరగని స్థాయిలో భక్త జనం త్రివేణి సంగమంలో పుణ్య స్నానాలు ఆచరిస్తున్నారు. శతాబ్దాలుగా సరస్వతి నదికి పుష్కరాలు జరుపుకునే ఆనవాయితీ కొనసాగుతున్నా అధికారికంగా మాత్రం సంవత్సరం మే నెలలో సరస్వతి పుష్కరాలు జరుపుకోవడం తొలిసారి. ఉత్తరాదిన ఉన్న ప్రయాగరాజ్ వద్ద మాత్రమే పుష్కరాలు నిర్వహించుకుంటారు. ఈ సాంప్రదాయాన్ని కాళేశ్వరంలో రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది మొదలుపెట్టింది. దీంతో దేశంలో రెండో చోట సరస్వతి నది పుష్కరాలు నిర్వహించుకునే సాంప్రాదాయానికి రాష్ట్ర ప్రభుత్వం కాళేశ్వరంలోని త్రివేణి సంగమం వేదిక అయింది.

పుష్కరాల్లో పవిత్ర పుణ్య స్నానాలు ఆచరించేందుకు దేశం నలుమూలల నుండి భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేస్తున్నారు. పుష్కర స్నానాలకు రోజు రోజుకు భక్తుల సంఖ్య రెట్టింపు అవుతోంది. దీంతో కాళేశ్వరం త్రివేణి సంగమ తీరం అంతా భక్తులతో కిక్కిరిసిపోతోంది. వేకువ జాము నుండి మొదలు రాత్రి వరకూ నదీ తీరం భక్తుల రాకతో సరికొత్త శోభను సంతరించుకుంది.

ఓ వైపున కుటుంబ సభ్యులతో కలిసి పుణ్య స్నానాలు, మరో వైపున త్రివేణి సంగమానికి చీరె, సారె సమర్పించడం, నీటి పక్కన సైకత లింగాలకు ప్రత్యేక పూజలు, వేద పండితుల మంత్రోచ్చారణలతో కాళేశ్వరంలోని త్రివేణి సంగమం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. నది తీరంలో పూర్వీకులను స్మరించుకుంటూ భక్తులు పితృ తర్పణాలు చేస్తున్నారు. సాధారణంగా తమ కుంటుంబ సభ్యులు చనిపోయిన రోజున అమశ్రాద్ధం నిర్వహించే తంతు కొనసాగిస్తుంటారు. కానీ పుష్కర నది తీరంలో తీర్థవిధి నిర్వహించుకునే సాంప్రాదాయానికి ఇక్కడ పెద్ద పీట వేస్తున్నారు. తిథి కార్యం చేసినప్పుడు మూడు తరాలను






తమ గోత్రీకులతో పాటు, చనిపోయిన బంధువులు, స్నేహితులను కూడా స్మరిస్తూ వారి పేరిట పిండ ప్రధానం చేయడం అత్యంత శ్రేయస్కరంగా భావిస్తుంటారు. ఇలాంటి ప్రతి అంశానికి ప్రాధాన్యత ఇచ్చే సంస్కృతి, సాంప్రాదాయలను పాటించేందుకు త్రివేణి సంగమానికి భక్తులు పెద్ద సంఖ్యలో పోటెత్తుతున్నారు. మే 21వ తేదీన ప్రారంభమైన సరస్వతి అంత్య పుష్కరాలు జూన్ 1వ తేదీతో ముగియనున్నాయి. సరస్వతి అంత్య పుష్కరాలు 8వ రోజున కాళేశ్వరానికి భక్తుల సంఖ్య మరింత ఎక్కువగా పెరిగింది.కాళేశ్వరం పుష్కరాలలో త్రివేణి సంగమంలో నిర్వహించే సరస్వతి నవరత్న మాలా హారతి, భాషా సాంస్కృతిక, సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలు సంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. నదీ హారతి కార్యక్రమం నిర్వహించేందుకు ప్రతి రోజు కాశీ నుండి వచ్చిన పండితులతో నిర్వహిస్తున్నారు. ప్రతి రోజు రాత్రి త్రివేణి సంగమ తీరాన భారీ సెట్టింగ్స్, విద్యుత్తు వెలుగుల మధ్య నిర్వహిస్తున్న హారతి భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది. సరస్వతి నవరత్న మాలా హారతి కార్యక్రమాన్ని భక్తులు వీక్షించేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యక్ష ప్రసారం చేస్తోంది. ఈ హారతి కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా వీక్షించలేని భక్తులు ఎక్కడి నుండైనా టీవీలు, సెల్ ఫోన్స్ ద్వారా ప్రత్యక్షంగా తిలకించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అవకాశం కల్పించింది.ఇంకా 4 రోజులు మాత్రమే సరస్వతి అంత్య పుష్కరాలు జరుగనున్నందున భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉందని జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు.

### కాళేశ్వరాలయం ఆధ్వర్యంలో ఉచిత అన్నదానం

పుష్కరాలకు వచ్చే భక్తుల కోసం దేవాలయం ఆధ్వర్యంలో ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. దేవస్థానం సిబ్బంది, వాలంటీర్లు సమన్వయంతో అన్నదానం కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహిస్తున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్నదానంలో పరిశుభ్రత, నాణ్యతపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. ఈ సేవలను భక్తులు సద్వినియోగం చేసుకోవాలని దేవస్థానం ఈఓ మహేష్ సూచించారు. సరస్వతి అంత్య పుష్కరాల సందర్భంగా భక్తులకు అన్ని విధాలుగా సౌకర్యాలు కల్పిస్తూ కాళేశ్వరం పుణ్యక్షేత్రం భక్తులతో కళకళలాడుతోంది.

### పుష్కర సానుమాచరించిన ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

నర్సంపేట శాసన సభ్యులు దొంతి మాధవ రెడ్డి గురువారం పుష్కర స్నానం ఆచరించి స్వామి వారిని దర్శించుకున్నారు. దేవాలయ చైర్మన్ మోహన శర్మ స్వామి వారికి తీర్థ ప్రసాదాలు అందించారు.

### పుష్కరాలలో ఒడిస్సీ నృత్య కళారూపం

కాళేశ్వరంలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జరుగుతున్న పుష్కరాలలోఒడిస్సీ నృత్య కళాకారులు అద్భుతమైన శాస్త్రీయ నృత్య ప్రదర్శనలతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. కార్యక్రమం ప్రారంభంలో మంగళాచరణ్ ప్రదర్శించబడింది. మహాకవి కాళిదాసు రచించిన శ్యామలా దండకంలోని మాణిక్య వీణా శ్లోకాన్ని ఆధారంగా తీసుకొని మాతంగి దేవిని స్తుతిస్తూ ఈ నృత్యాన్ని ఆవిష్కరించారు. వీణా వాయిస్తున్న దేవి స్వరూపం, చంద్రకళ, కదంబవన విహారం, సంగీత ప్రియత వంటి భావాలను హావభావాలతో అద్భుతంగా ప్రదర్శించారు. త్రిఖండి ప్రణామం ద్వారా దేవతలకు, గురువులకు, ప్రేక్షకులకు నమస్కారం సమర్పించారు.తదుపరి "బట్టు" అనే స్వచ్ఛ నృత్య అంశాన్ని ప్రదర్శించారు. సరస్వతి అంత్య పుష్కరాల సందర్భంగా నిర్వహిస్తున్న ఈ సాంస్కృతిక కార్యక్రమాలు భారతీయ శాస్త్రీయ కళల వైభవాన్ని ప్రతిబింబిస్తూ కాళేశ్వరాన్ని ఆధ్యాత్మిక–సాంస్కృతిక కేంద్రంగా నిలుపుతున్నాయి.



# చిత్రపురిలో అన్నగారికి ఘన నివాళులు..

### పాల్గొన్న సినీ ప్రముఖులు



ముద్ర హైదరాబాద్ : తెలుగువారి ఆరాధ్య దైవం, విశ్వవిఖ్యాత నటసార్వభౌముడు స్వర్గీయ శ్రీ నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) గారి 103వ జయంతి సందర్భంగా హైదరాబాద్ చిత్రపురి కాలనీలోని అన్నగారి విగ్రహం వద్ద ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నందమూరి మోహన్ కృష్ణ గారు, ఆయన కుమార్తె మోహన్ రూప పాల్గొని అన్నగారికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా చిత్రపురి మాజీ అధ్యక్షులు, ఫిలిం ఫెడరేషన్ అధ్యక్షులు వల్లభనేని అనిల్ కుమార్ గారు, మాజీ కౌన్సిలర్ వల్లభనేని హైమాంజలి గారు కూడా పాల్గొని ఎన్టీఆర్ సేవలను స్మరించుకున్నారు. అలాగే ప్రముఖ నిర్మాత, దర్శకుడు, తెలుగు చిత్ర నిర్మాత మండలి (టీఎఫ్.పీ.సీ) సెక్రటరీ తుమ్మల ప్రసన్నకుమార్ గారు హాజరై అన్నగారి సినీ, రాజకీయ సేవలను కొనియాడారు. తెలుగు ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ మాజీ అధ్యక్షులు, ప్రస్తుతం ఫిల్మ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ , ఏపీ ఎఫ్‌డీసీ చైర్మన్ శ్రీ పి. భరత్ భూషణ్ గారు కూడా కార్యక్రమంలో పాల్గొని ఎన్టీఆర్ తెలుగు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయే మహానేత అని పేర్కొన్నారు. చిత్రపురి మాజీ సెక్రటరీ దొరై , మాజీ కమిటీ సభ్యులు, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో హాజరై ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమం మొత్తం భావోద్వేగ వాతావరణంలో కొనసాగింది.

# ఐఎస్ఎస్ఎఫ్ ప్రపంచ కప్ షూటింగ్‌లో ఇషా ప్రతిభ

**ముద్ర, తెలంగాణ బ్యూరో:** ఐఎస్ఎస్ఎఫ్ ప్రపంచ కప్–2026 షూటింగ్‌లో అసాధారణ ప్రతిభ కనబరిచి చారిత్రాత్మక విజయం సాధించిన ఇషా సింగ్‌కు సీఎం రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు. మ్యూనిచ్‌లో జరుగుతున్న ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్ కప్ మహిళల 25 మీటర్ల పిస్టల్ ఫైనల్లో 43 హిట్స్ సాధించి అద్భుతమైన స్కోర్‌తో ప్రపంచ రికార్డును బద్దలు కొట్టిన ఇషా, సాధించిన విజయం భారత షూటింగ్ క్రీడా చరిత్రలో చిరస్మరణీయ ఘట్టంగా నిలిచిపోతుందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. హైదరాబాద్‌కు చెందిన ఇషా సింగ్ తన అంకితభావం, క్రమశిక్షణ, పట్టుదలతో లక్షల మందికి స్ఫూర్తిగా నిలుస్తోందని ప్రశంసించారు. ఆమె అద్భుతమైన ప్రదర్శన భారత క్రీడాకారులకు స్ఫూర్తిదాయకమని, భారత క్రీడల ఉజ్వల భవిష్యత్తుకు నిదర్శనమని అన్నారు. ఇషా సింగ్ భవిష్యత్తులో మరెన్నో విజయాలు సాధించాలని, ఇంకా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సీఎం ఆకాంక్షించారు. ఆమె దేశానికి మరింత కీర్తి తీసుకురావాలని ఆకాంక్షించారు.

# పాపం సన్ రైజర్స్..

### పరుగుల వర్షం కురిపించినా సన్ రైజర్స్ కు అదృష్టం కలిసిరాలేదు..! రాజస్థాన్ తుఫాన్ ముందు హైదరాబాద్ ఆశలు ఆవిరి..!

ముద్ర డెస్క్ : ఐపీఎల్ సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు అద్భుత ప్రదర్శన చేసినప్పటికీ అదృష్టం మాత్రం కలిసి రాలేదు. బ్యాటింగ్‌లో క్లాసెన్ 624 పరుగులతో జట్టుకు ప్రధాన బలంగా నిలిచాడు. ఇషాన్ కిషన్ 602 పరుగులు చేసి మెరిశాడు. యువ ఆటగాడు అభిషేక్ శర్మ 563 పరుగులతో దూకుడు చూపించగా, ట్రావిస్ హెడ్ 410, నితీశ్ రెడ్డి 302 పరుగులతో కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు. పలుమ్యాచ్‌ల్లో సన్ రైజర్స్ హైదరాబాద్ బ్యాటర్లు ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడి భారీ స్కోర్లు నమోదు చేశారు. అటు బౌలింగ్ విభాగంలో కూడా హైదరాబాద్ జట్టు ప్రభావం చూపించింది. ఇషాన్ మలింగ 20 వికెట్లు తీసి జట్టు ప్రధాన ఆయుధంగా మారాడు. సాకిబ్ 15 వికెట్లు సాధించగా, ప్రఫుల్ 14 వికెట్లతో ఆకట్టుకున్నాడు. శివాంగ్ 9, కెప్టెన్ కమిన్స్ 8 వికెట్లు తీసి కీలక సమయాల్లో జట్టుకు బ్రేక్‌థ్రూలు అందించారు. బ్యాటింగ్, బౌలింగ్ రెండు విభాగాల్లోనూ సమతూకంగా కనిపించిన సన్ రైజర్స్ హైదరాబాద్ ఈసారి కప్పు ఫేవరెట్‌గా నిలిచింది. అయితే ఎలిమినేటర్ మ్యాచ్‌లో రాజస్థాన్ యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ విజృంభణతో మ్యాచ్ పూర్తిగా మలుపుతిరిగింది. అతడి విధ్వంసక ఇన్నింగ్స్ ముందు హైదరాబాద్ బౌలర్లు తేలిపోవడంతో సన్ రైజర్స్ హైదరాబాద్ టైటిల్ ఆశలు ఆవిరయ్యాయి. అద్భుత సీజన్ ఆడినా చివరి అడుగులో తడబడటంతో అభిమానులు తీవ్ర నిరాశకు గురయ్యారు.

# కూకట్‌పల్లి అనన్య హాస్పిటల్‌లో ఘోరం

### గాల్‌బ్లాడర్ ఆపరేషన్ జరిగిన రెండ్రోజులకే రోగి మృతి ఆసుపత్రి ఎదుట బంధువుల ఆందోళన.. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు



**ముద్ర కూకట్‌పల్లి :** సొంత కాళ్లపై నడుచుకుంటూ ఆసుపత్రికి వచ్చిన ఒక పేషెంట్, వైద్యుల తీవ్ర నిర్లక్ష్యం కారణంగా శవమై ఇంటికి చేరిన విషాద ఘటన కూకట్‌పల్లిలోని అనన్య హాస్పిటల్‌లో చోటుచేసుకుంది. బాధితుల కథనం ప్రకారం... ఉమ్మల్ల మల్లయ్య అనే వ్యక్తి గాల్‌బ్లాడర్ సమస్యతో ఈ నెల 26న అనన్య హాస్పిటల్‌లో చేరారు. అదే రోజు వైద్యులు ఆయనకు ఆపరేషన్ నిర్వహించారు. అయితే, శస్త్రచికిత్స పూర్తయినప్పటి నుండి మల్లయ్య తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతూ వచ్చారు. ఈ విషయమై కుటుంబ సభ్యులు వైద్యులను సంప్రదించగా, "ఆపరేషన్ తర్వాత అలానే ఉంటుంది.. మేమేం చేయలేం" అంటూ నిర్లక్ష్యంగా సమాధానమిచ్చారు. రెండో రోజు కూడా మల్లయ్య నొప్పి భరించలేక విలవిలలాడుతుండటంతో బంధువులు పదే పదే డాక్టర్లను బ్రతిమాలారు. కాగా, రోగి బాధను పట్టించుకోకపోగా, పదే పదే అడుగుతున్నారంటూ వైద్యులు బంధువులపై చిరాకు పడ్డారు. సరైన సమయంలో స్పందించి చికిత్స అందించకపోవడంతో, తీవ్రమైన నొప్పితో నరకం అనుభవించిన మల్లయ్య గురువారం తెల్లవారుజామున 4 గంటల ప్రాంతంలో ప్రాణాలు కోల్పోయారు.మల్లయ్య మృతి చెందడంతో హాస్పిటల్ యాజమాన్యం తమకేమీ సంబంధం లేదన్నట్లుగా ప్రవర్తించింది. ఆయనకు గుండెపోటు రావడం వల్లే చనిపోయాడని చెబుతూ చేతులు దులిపేసుకునే ప్రయత్నం చేసింది. వైద్యుల నిర్లక్ష్యం వల్లే మల్లయ్య చనిపోయాడంటూ ఆగ్రహం వ్యక్తం చేసిన కుటుంబ సభ్యులు, బంధువులు మృతదేహంతో ఆసుపత్రి ఎదుట ఆందోళనకు దిగారు. న్యాయం చేయాలంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

# గ్రీన్ ఎనర్జీ హబ్ గా తెలంగాణ

### డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క




**ముద్ర, ఖమ్మం :** తెలంగాణను గ్రీన్ ఎనర్జీ హబ్‌గా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక చర్యలు చేపడుతోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఖమ్మం జిల్లా బోనకల్ మండలంలో మోడల్ సోలార్ గ్రామాలు, సోలార్ పంపుసెట్లను ప్రారంభించిన ఆయన.. బోనకల్, కొడంగల్ మండలాలను సంపూర్ణ సోలరైజేషన్ మండలాలుగా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. రైతులకు సాగునీటితో పాటు మిగులు విద్యుత్ ద్వారా అదనపు ఆదాయం వచ్చేలా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోందన్నారు. రాష్ట్రంలో 81 గ్రామాలను మోడల్ సోలార్ గ్రామాలుగా అభివృద్ధి చేస్తున్నామని, మహిళా సంఘాల ద్వారా సోలార్ ప్లాంట్ల నిర్వహణకు ప్రోత్సాహం ఇస్తున్నామని చెప్పారు. ఇదే సమయంలో అకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం MSPతోనే కొనుగోలు చేస్తుందని హామీ ఇచ్చారు. మొక్కజొన్న కొనుగోళ్ల కోసం రూ.5,000 కోట్లు విడుదల చేశామని తెలిపారు. ప్రతిపక్షాలు కట్టుకథలు మానుకోవాలని, రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.


ఈ ఈ కార్యక్రమంలో వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, జిల్లా కలెక్టర్ టిఎస్ దివాకర, ట్రాన్స్ కో సిఎండి కృష్ణ భాస్కర్, టీజీ ఎన్పీడీసీఎల్ సిఎండి వరుణ్ రెడ్డి, రెడ్కో వైస్ చైర్మన్ & ఎండి అనిల, సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


# ఎన్టీఆర్ దేశం గర్వించే మహానేత..

**-ఆయన స్ఫూర్తితోనే ప్రజా పాలన: సీఎం రేవంత్ రెడ్డి**
**-ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ జీవితాంతం గుర్తుండే జ్ఞాపకమన్న సీఎం**
**-అంబేద్కర్, ఇందిరాగాంధీ, ఎన్టీఆర్‌లను జాతిరత్నాలు**
**- కులాలు, ప్రాంతాలకు అతీతంగా ఎన్టీఆర్ ప్రజానాయకుడు**
**- ఫ్యూచర్ సిటీతో యువతకు భారీ ఉద్యోగ అవకాశాలు**
**- 2034 వరకు ప్రజా ప్రభుత్వానిదే అధికారం**

**ముద్ర , హైదరాబాద్ :** తెలుగుజాతి గర్వించదగ్గ మహానేత, దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచే నాయకుడు ఎన్టీఆర్ అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, "తెలుగుజాతి అన్నా"గా ప్రజల హృదయాల్లో నిలిచిన ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించడం తనకు జీవితాంతం గుర్తుండిపోయే జ్ఞాపకమని పేర్కొన్నారు.దేశ చరిత్రలో స్ఫూర్తిగా నిలిచిన ముగ్గురు జాతిరత్నాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని సీఎం అన్నారు. భారత రాజ్యాంగాన్ని రచించి పేదలకు ఓటు హక్కు కల్పించిన డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్, భూసంస్కరణలు తీసుకొచ్చి పేదలకు హక్కులు కల్పించిన ఇందిరాగాంధీ, నీతి–నిజాయితీకి ప్రతీకగా నిలిచిన ఎన్టీఆర్‌లను జాతి ఎప్పటికీ మరువదన్నారు.కాంగ్రెస్ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించడం పై వస్తున్న విమర్శలను ఆయన తిప్పికొట్టారు. కులాలు, మతాలు, ప్రాంతాలకు అతీతంగా జాతి గర్వించదగ్గ నాయకుడు ఎన్టీఆర్ అని స్పష్టం చేశారు. ఇది కేవలం విగ్రహం మాత్రమే కాదని, రాజకీయాలకు అతీతమైన స్ఫూర్తి అని వ్యాఖ్యానించారు. తెలంగాణ రాజకీయాలకు తుమ్మల నాగేశ్వరరావు, మండవ వెంకటేశ్వరరావు, కడియం శ్రీహరి, మోత్కుపల్లి నర్సింహులు వంటి నాయకులను అందించిన ఘనత ఎన్టీఆర్‌దేనని సీఎం గుర్తుచేశారు. కేసీఆర్‌ను కూడా నాయకుడిగా గుర్తించింది ఎన్టీఆర్ నేనని పేర్కొన్నారు.రూ.2 కిలో బియ్యం పథకం నుంచి మహిళా సంక్షేమం వరకు ఎన్నో కార్యక్రమాలకు ఎన్టీఆర్ స్ఫూర్తిగా నిలిచారని రేవంత్ రెడ్డి అన్నారు. బలహీన వర్గాలు పాలకులుగా ఎదగడంలో ఆయన పాత్ర కీలకమని చెప్పారు. పటేల్–పట్వారీ వ్యవస్థ రద్దు చేసి పేదలకు ఆత్మగౌరవం కల్పించిన ఘనత కూడా ఎన్టీఆర్‌కే చెందుతుందన్నారు.ఇందిరమ్మ ఒక తరం అయితే, ఎన్టీఆర్ ఒక శకం అని వ్యాఖ్యానించిన సీఎం.. తమ ప్రభుత్వం తీసుకునే ప్రతి నిర్ణయంలో ఆ ఇద్దరి స్ఫూర్తి కనిపిస్తుందని చెప్పారు.

మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడం, రైతును రాజును చేయడం తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. మొదటి ఏడాదిలోనే 65 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని, మహిళల సంక్షేమం కోసం రూ.60 వేల కోట్లు ఖర్చు చేశామని వెల్లడించారు. ఉపఎన్నికల్లో ప్రజలు అందించిన మద్దతుతోనే ప్రజాపాలన ముందుకు సాగుతోందన్నారు.2034 వరకు ప్రజా ప్రభుత్వానిదే అధికారం అని ధీమా వ్యక్తం చేసిన సీఎం, హైదరాబాద్‌ను అంతర్జాతీయ నగరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. 30 వేల ఎకరాల్లో 'భారత్ ఫ్యూచర్ సిటీ' నిర్మాణానికి ప్రభుత్వం సిద్ధమవుతోందని, ప్రపంచ దిగ్గజ కంపెనీలను అక్కడికి తీసుకొచ్చి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, సీవీఆర్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికపూడి గాంధీ, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్, ఎన్టీఆర్ కుటుంబ సభ్యులు, పలువురు సినీ నటులు హాజరయ్యారు..





సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శుక్రవారం 29-05-2026
www.mudranews.in | @mudranews



### బాదం పప్పుల ద్వారా పోషకాలు

**పచ్చిగా లేదా నేరుగా తినడం తగ్గించండి:**

పచ్చి బాదం పప్పులను నేరుగా తినడం వల్ల జీర్ణ వ్యవస్థపై అదనపు భారం పడుతుంది మరియు శరీరానికి కీలకమైన ఖనిజాలు అందవు.



## గోవును జాతీయ జంతువుగా ప్రకటించాలి

### - వీహెచ్‌పీ, బజరంగ్ దళ్ డిమాండ్



**ముద్ర, నారాయణ పేట:** గోవును జాతీయ జంతువుగా ప్రకటించాలని విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్ నాయ కులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని వీరసావర్కర్ చౌరస్తాలో గురువారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పవిత్ర గోమాత వధను ప్రోత్సహించే చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. గోరక్షణ కోసం ఎలాంటి త్యాగానికైనా సిద్ధమని స్పష్టం చేశారు. హిందూ సమాజ భావోద్వేగాలను రెచ్చగొట్టే విధంగా ప్రవర్తించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీస్ శాఖను కోరారు. దేశంలోని అనేక రాష్ట్రాల్లో గోవధ నిషేధ చట్టాలు అమలులో ఉన్నాయని, గోవధకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంతకుముందు వీర సావర్కర్ జయంతి వేడుకలను నిర్వహించి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో విహెచ్‌పీ జిల్లా కార్యదర్శి కన్న శివకుమార్, పట్టణ అధ్యక్షుడు మురళి భట్టాడ్, ప్రవీణ్, శ్రవణ్, రఘువీర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళా పెట్రోల్ బంక్ ను సందర్శించిన ట్రైనీ కలెక్టర్లు



**ముద్ర, నారాయణ పేట:** జిల్లా కేంద్రంలో డీఆర్డీఏ జిల్లా మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహిళా పెట్రోల్ బంక్ ను గురువారం ట్రైనీ కలెక్టర్లు శ్రీకాంత్ రెడ్డి, సచిన్, సురేష్, పారస్ సందర్శించారు. ఈ సందర్భంగా మహిళా సమాఖ్య సభ్యులు, పెట్రోల్ బంక్ నిర్వాహకులతో కలెక్టర్ల బృందం మాట్లాడి బంక్ స్థాపనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. పెట్రోల్ బంక్ ఏర్పాటుకు అప్పటి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ప్రోత్సాహం అందించారని మహిళా సమాఖ్య సభ్యులు తెలిపారు. ప్రభుత్వ స్థలం కేటాయింపుతో పాటు భారత్ పెట్రోలియం కంపెనీ ద్వారా రూ.1.10 కోట్ల సహాయం అందించారని వివరించారు. మహిళా సమాఖ్య నుంచి రూ.35 లక్షల పెట్టుబడితో పనులు ప్రారంభించామని చెప్పారు. ప్రస్తుతం జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సహకారంతో అన్ని అనుమతులు పూర్తిచేసుకుని 2025 ఫిబ్రవరి 21న ముఖ్యమంత్రి చేతుల మీదుగా పెట్రోల్ బంక్ ప్రారంభించామని పేర్కొన్నారు. ఇప్పటివరకు 10.23 లక్షల లీటర్ల పెట్రోల్, 11.62 లక్షల లీటర్ల డీజిల్ విక్రయించి రూ.61 లక్షల ఆదాయం సాధించామని తెలిపారు. ఖర్చులు పోగా రూ.27.50 లక్షల లాభంతో మహిళా పెట్రోల్ బంక్ విజయవంతంగా కొనసాగుతోందని వెల్లడించారు.

## విజయవంతంగా కంటి శిబిరం



**ముద్ర ప్రతినిధి, నాగర్‌కర్నూల్:** జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో గురువారం పాత కలెక్టరేట్ భవనంలోని 102వ గదిలో నిర్వహించిన కంటి చికిత్స శిబిరం విజయవంతంగా ముగిసిందని నాగర్‌కర్నూల్ ఆప్తాలమిక్ అధికారి కొత్ర బాలాజీ తెలిపారు. ఈ శిబిరంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 112 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, అందులో క్యాటరాక్ట్ సమస్యతో బాధపడుతున్న అర్హులైన 50 మందిని గుర్తించి ప్రత్యేక అంబులెన్స్‌లో లయన్ రాంరెడ్డి కంటి ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. శిబిరంలో రోగులకు ప్రత్యేక కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు, వైద్య సూచనలు అందజేశారు. జీవితకాలం కంటి చూపును కాపాడుకోవాలంటే నిత్యాహారంలో విటమిన్–ఏ అధికంగా ఉండే క్యారెట్, ఆకుకూరలు, చేపలు వంటి ఆహార పదార్థాలను ఎక్కువగా తీసుకోవాలని వైద్యులు సూచించారు. ఈ కార్యక్రమంలో సుకుమార్ రెడ్డి, సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ గ్రామాన టీఆర్ఎస్ పార్టీని బలోపేతం చేస్తాం

**ముద్ర, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రతినిధి:** మహబూబ్‌నగర్ జిల్లాలో తెలంగాణ రక్ష ణ సేన (టీఆర్ఎస్) పార్టీని గ్రామ గ్రామాన బలోపేతం చేస్తామని పార్టీ అబ్జర్వర్ గుంజప డుగు హరిప్రసాద్ తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట పార్టీ జెండాను ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో విఫలమయ్యాయని విమర్శించారు. తెలంగాణ ప్రాంత నిరుద్యో గులు, ఉద్యమకారులు, అణగారిన వర్గాలకు అండగా నిలవాలనే లక్ష్యంతో కవిత నాయకత్వంలో తెలంగాణ రక్షణ సేన పార్టీ ఏర్పాటైందని నియోజకవర్గ ఇన్‌చార్జ్ నందిని ప్రభాకర్, అబ్జర్వర్ సౌజన్య రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి నప్పుడు ప్రజలు ఆశించిన "నీళ్లు, నిధులు, నియామకాలు" లక్ష్యాలను గత, ప్రస్తు త ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేశాయని ఆరోపించారు. విద్య, వైద్యం, రైతాంగం, కార్మికులు, యువత, వెనుకబడిన వర్గాల సమస్యల పరిష్కారానికి టీఆర్ఎస్ పార్టీ కృషి చేస్తుందని తెలిపారు.

జిల్లా ఇన్‌చార్జ్ మెట్టుకాడి ప్రభాకర్ ముదిరాజ్ మాట్లాడుతూ తెలంగాణలో నిజమైన సామాజిక న్యాయం టీఆర్ఎస్ ద్వారానే సాధ్యమవుతుందని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ వెంకట రామమూర్తి, జేపీ శ్యాంప్రసాద్, పూర్ణచంద్ర గౌడ్, మల్లేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.




# త్యాగం, ప్రేమ, సోదర భావానికి ప్రతీక బక్రీద్



తాండూర్ లో..



మహబూబ్ నగర్ లో..



కూకట్ పల్లిలో..

### - ఎమ్మెల్యే పట్నం మనోహర్ రెడ్డి

**ముద్ర, తాండూర్ ప్రతినిధి.:**

బక్రీద్ పర్వదినం సందర్భంగా తాండూ ర్‌లోని ప్రధాన ఈద్గా మైదానంలో ముస్లిం సోదరులు సామూహిక ప్రార్థనలు నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో తాండూర్ ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి, ప్రభుత్వ చీఫ్ పట్నం మహేందర్ రెడ్డి పాల్గొని ము స్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి మాట్లాడుతూ త్యాగం, ప్రేమ, సోదర భావానికి బక్రీద్ ప్రతీక అని పేర్కొన్నారు. కుల మతాలకు అతీతంగా హిందూ, ముస్లింలు కలిసి పండుగలను ప్రశాంత వాతావరణం లో జరుపుకోవడం తాండూర్ ప్రాంత ప్రత్యేకత అని అన్నారు.

ప్రార్థనల అనంతరం మత పెద్దలు, యువకులతో కలిసి నాయకులు ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. పండుగ సంద ర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఆధ్వ ర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పా టు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బొట్టు నరసింహులు, వైస్ చైర్మన్ అబ్దుల్ రజాక్, ఎంఐఎం పట్టణ అధ్యక్షుడు హాది షరీఫ్, డిసిసి అధ్యక్షుడు ధారాసింగ్ నాయక్, పట్టణ అధ్యక్షుడు బాతుల నాగ రాజ్, టిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ శ్రీశైలు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### కూకట్ పల్లిలో..

**ముద్ర, కూకట్‌పల్లి:**

బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్ల మ్మబండ ఈద్గా వద్ద ముస్లింలు సామూహి క ప్రార్థనలు నిర్వహించారు. ఈ వేడుకల్లో పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ , మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ ప్రార్థనా కార్యక్రమాలలో ముస్లిం మత పెద్దలు, పెద్ద సంఖ్యలో ము స్లింలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

### మహబూబ్ నగర్ లో..

**ముద్ర,ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి:**

బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకొని మహబూబ్ నగర్లోని మయూరి పార్కు వద్ద గల హైలే హద్దీస్ ఈద్గా వద్ద నిర్వహించిన ప్రత్యేక ప్రార్థన కార్యక్రమాల్లో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. ప్రార్థనల అనంతరం ఎమ్మెల్యే ముస్లింలకు బక్రీద్ పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూసుఫ్ బిన్ బదర్, మహ్మద్ సలీమ్, జియొద్దీన్ సైఫ్, నేమతుల్లా సాబ్, జాబేర్ బిన్ సయీద్, ఇస్సా అమోధి తదితరులు పాల్గొన్నారు .

### నాగర్ కర్నూల్ లో..

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్**

బక్రీద్ పండుగ సందర్భంగా జిల్లా కేంద్రంలోని శ్రీపురం రోడ్డులో గల ఈద్గా వద్ద ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ రాజేశ్ రెడ్డి ప్రార్థనల అనంతరం ముస్లింలకు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, మానవాళిని జాగృతపరిచి మన లోని త్యాగనిరతిని చాటిచెప్పే పవిత్రమైన పండుగ బక్రీద్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తీగల సునేంద్ర, వైస్ చైర్మన్ బాదం రమేష్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వినోద్, స్థానిక కౌన్సిలర్లు, మత పెద్దలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.





కూకట్ పల్లిలో..



కాప్రాలో..

# ఎన్టీఆర్ జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయం

### - కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్

**ముద్ర కూకట్‌పల్లి:**

తెలుగుజాతి పౌరుషాన్ని, ఆత్మగౌరవాన్ని ప్రపంచవ్యాప్తంగా చాటిచెప్పిన మహానేత నందమూరి తారక రామారావు జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ పేర్కొన్నారు. ఎన్టీఆర్ 103వ జయంతి సందర్భంగా కూకట్‌పల్లి నియోజకవర్గవ్యాప్తంగా అభిమానులు, టీడీపీ కార్యకర్తలు ఘనంగా వేడుకలు నిర్వహించారు. కేక్ కటింగ్‌లు, ద్విచక్ర వాహన ర్యాలీలు, రక్తదాన, అన్నదాన శిబిరాలతో ప్రాంతమంతా ఎన్టీఆర్ నామస్మరణతో మారుమోగింది. కేపీహెచ్‌బీ కాలనీలో ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరాన్ని బండి రమేష్ సందర్శించి నిర్వాహకులను అభినందించారు. రాజ్యసభ సభ్యులు గరికపాటి రామ్మోహన్ రావు కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు. వసంత నగర్, ప్రగతి నగర్, ఎన్టీఆర్ ఘాట్ వద్ద జరిగిన జయంతి వేడుకల్లో బండి రమేష్ పాల్గొని ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వేలాదిగా తరలివచ్చినవారికి అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు, ఎన్టీఆర్ అభిమానులు పాల్గొని ఎన్టీఆర్ సేవలను స్మరించుకున్నారు.

### కాప్రాలో ఎన్టీఆర్‌కు ఘన నివాళి

**ముద్ర, కాప్రా:**

మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు 103వ జయంతి సందర్భంగా కాప్రా పరిధిలో ఎన్టీఆర్ విగ్రహాలకు ఘనంగా నివాళులర్పించారు. డాక్టర్ ఏఎస్ రావు నగర్, జమ్మిగడ్డ, మీర్‌పేట్ హౌసింగ్ బోర్డు ప్రాంతాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పాల్గొని పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలుగు ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన ఎన్టీఆర్ రాజకీయాలతో పాటు సినీరంగంలో కూడా చెరగని ముద్ర వేసిన మహానేత అని కొనియాడారు. యువత ఎన్టీఆర్ ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే సుభాష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ జనార్ధన్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, బీఆర్ఎస్, టీడీపీ నాయకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వరి కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:**

నాగర్ కర్నూల్ జిల్లా తెలకపల్లి మండలం చిన్న ముద్దునూరు గ్రామంలోని వరి కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వ నిబంధనల మేరకు కొనుగోలు చేస్తామని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కేంద్రంలో ధాన్యం కొనుగోళ్లు, రవాణా, నమోదు ప్రక్రియలు, కాంటా వివరాలను కలెక్టర్ పరిశీలించారు. రైతులకు అందుతున్న సౌకర్యాలు, తూకం విధానం, నాణ్యత ప్రమాణాలు, రికార్డుల నిర్వహణపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. రిజిస్టర్లు, ట్రక్ షీట్లను తనిఖీ చేసిన కలెక్టర్ కేంద్రానికి వచ్చిన లారీలు, అన్ లోడింగ్ ప్రక్రియ, మిల్లులకు తరలింపు వివరాలను సమీక్షించారు. ధాన్యం ఎక్కువకాలం నిల్వ ఉండకుండా వేగంగా లోడింగ్ పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

# తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తాం



### - కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్

**ముద్ర ప్రతినిధి, నాగర్‌కర్నూల్:**

రైతులు పండించిన ప్రతి గింజకు గిట్టుబాటు ధర దక్కేలా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ తెలిపారు. ధాన్యం కొనుగోళ్లలో జాప్యం లేకుండా పారదర్శకంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. తేమ కారణంగా తడిసిన వరి, మొక్కజొన్న ధాన్యాన్ని కూడా ప్రభుత్వ నిబంధనల మేరకు కొనుగోలు చేస్తామని స్పష్టం చేశారు. గురువారం అచ్చంపేట మండలం చెన్నారం గ్రామంలోని లలిత ఉమామహేశ్వర కాటన్ జిన్నింగ్ మిల్, నడింపల్లి గ్రామంలోని వెంకటేశ్వర కాటన్ మిల్లులను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మిల్లుల్లో నిల్వ ఉంచిన ధాన్య బస్తాలను పరిశీలించి నిల్వ సామర్థ్యం, కొనుగోలు విధానం, మిల్లింగ్ ప్రక్రియపై అధికారులతో సమీక్ష నిర్వహించారు.

వర్షాల నేపథ్యంలో ధాన్యం తడవకుండా టార్పాలిన్లు, కవర్లు ఏర్పాటు చేయాలని, గిడ్డంగులను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. హమాలీల కొరత లేకుండా అవసరమైతే అదనపు సిబ్బందిని నియమించాలని ఆదేశించారు. రైతులు ఎక్కువ సేపు వేచి ఉండకుండా తూకం, లోడింగ్, రవాణా ప్రక్రియలను వేగవంతం చేయాలని తెలిపారు.

ధాన్యం కొనుగోళ్లలో తేమ శాతం, నాణ్యత ప్రమాణాలను పారదర్శకంగా నమోదు చేయాలని అధికారులను హెచ్చరించారు. రైతులతో మాట్లాడిన కలెక్టర్ కొనుగోలు, చెల్లింపుల సమస్యలను అడిగి తెలుసుకుని రైతుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు.

ఈ తనిఖీలలో అచ్చంపేట తహసీల్దార్ సైదులు, సంబంధిత శాఖల అధికారులు, మిల్లుల నిర్వాహకులు పాల్గొన్నారు.

# తెలుగు భాష కోవిదుడు సురవరం

### - ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

**ముద్ర, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రతినిధి:**

తెలుగు భాషా వికాసానికి విశేష కృషి చేసిన మహానుభావుడు సురవరం ప్రతాప రెడ్డి అని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గురువారం పాలమూరు రెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన సురవరం ప్రతాపరెడ్డి జయంతి కార్యక్రమంలో పాల్గొన్న ఆయన సురవరం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పత్రికా సంపాదకుడిగా, పరిశోధకుడిగా, పండితుడిగా, రచయితగా, ఉద్యమకారుడిగా సురవరం ప్రతాపరెడ్డి సేవలు చిరస్మరణీయమన్నారు. తెలంగాణలోని 348 మంది కవుల జీవిత విశేషాలతో "గోల్కొండ కవుల సంచిక" గ్రంథాన్ని ప్రచురించి తెలంగాణ సాహిత్య ఖ్యాతిని ప్రపంచానికి చాటారని పేర్కొన్నారు. గోల్కొండ పత్రికను స్థాపించి సంపాదకుడిగా తెలుగు ప్రజల్లో చైతన్యం నింపారని, నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ప్రజలను మేల్కొల్పిన గొప్ప వ్యక్తి సురవరం అని కొనియాడారు. ఆయన రచించిన "ఆంధ్రుల సాంఘిక చరిత్ర" గ్రంథానికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించిందని గుర్తు చేశారు.

ఈ కార్యక్రమంలో మేయర్ గుమ్మాల మమత, టీపీసీసీ కార్యదర్శి మిథున్ రెడ్డి, డిప్యూటీ మేయర్ సురేందర్ రెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్, గ్రంథాలయ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, రెడ్డి సేవా సమితి ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శుక్రవారం 29.05.2026
www.mudranews.in | @mudranews



**బాదం పప్పుల ద్వారా పోషకాలు:**



పోషకాల శోషణను పెంచుకోండి: బాదంను నానబెట్టి తిన డం ద్వారా అందులో ఉండే జింక్, ఇనుము (ఐరన్), మెగ్నీషి యం, కాల్షియం వం టి ఖనిజా లను మన శరీరం సులభంగా గ్రహిస్తుంది.

# ముస్లింల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

**- మసీదులు, ఈద్గాల అభివృద్ధికి రూ.7 కోట్లు కేటాయించాం**

**- మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**




**ముద్ర, ధర్మపురి:**
రాష్ట్ర ప్రభుత్వం ముస్లింల సంక్షేమానికి కట్టుబడి ఉందని సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. బక్రీద్ పర్వదినం సందర్భంగా గురువారం జగిత్యాల జిల్లా ధర్మపురి లోని ఈద్గా వద్ద నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి మాట్లాడుతూ రాష్ట్రంలో పేద ముస్లింల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. ధర్మపురి నియోజక వర్గంలో మసీదులు, ఈద్గాల అభివృద్ధికి రూ. 7కోట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. ఎస్సీ సంక్షేమ శాఖ ద్వారా నిరుద్యోగ యువతి, యువకులు స్వయం ఉపాధి పొందడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ధర్మపురి నియోజకవర్గంలో పదో తరగతి, ఇంటర్ పూర్తి అయిన యువతి, యువకుల స్వయం ఉపాధి కోసం రూ. 2 లక్షల రుణాలు బ్యాంకు ద్వారా ఇప్పించడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఆసక్తి కలిగి న యువతి, యువకులు రుణాలు పొంది స్వయం ఉపాధి పొందాలని కోరారు. మంత్రి వెంట మున్సిపల్ చైర్ పర్సన్ వేముల నాగలక్ష్మి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంగనభట్ల దినేష్ ఉన్నారు.

## ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరిస్తాం

**-మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**



**ముద్ర, ధర్మపురి:** రాష్ట్రంలోని ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. జగిత్యాల జిల్లా హకు చెందిన పలువురు ఆశా వర్కర్లు గురువారం ధర్మపురిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంత్రి అడ్లూరిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి మాట్లాడుతూ ఆశా వర్కర్ల న్యాయమైన సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సుముఖంగా ఉన్నారని చెప్పారు. దశల వారీగా ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరిస్తామని మంత్రి ఆశా వర్కర్లకు హామీ ఇచ్చారు.

## రైతులు ఆందోళన చెందొద్దు

**- తడిసిన ప్రతి ధాన్యం గింజ కొంటాం**

**- జగిత్యాల కలెక్టర్ సత్యప్రసాద్**



**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:**
జిల్లాలో ఇటీవల కురుస్తున్న వర్షాలతో ధాన్యం తడిసిన నేపథ్యంలో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ బి. సత్యప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు తడిసిన, రంగు మారిన ధాన్యాన్ని సైతం చివరి గింజ వరకు కొనుగోలు చేయడానికి ప్రభుత్వం పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉందన్నారు. రైతులు తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులు, నిర్వాహకులు ధాన్యం కుప్పలు తడవకుండా టార్పాలిన్ కవర్లతో కప్పాలని పేర్కొన్నారు.

# చివరి గింజ వరకూ కొంటాం

**-సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి**



**ముద్ర, కరీంనగర్:**
ధాన్యం చివరి గింజ వరకూ కొంటామని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి స్పష్టం చేశారు. గురువారం ఆయన కరీంనగర్ మండలం నగునూర్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతుల సమస్యలు తెలుసుకున్నారు. అక్కడినుండే అధికారులతో మాట్లాడి ప్రత్యేక గోదాంలను కేటాయించే విధంగా సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా రైతులతో నరేందర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతు పక్షపాతి అన్నారు. ఎవ్వరూ ఆందోళన చెందవద్దని, చివరి గింజవరకూ కొనుగోలు చేస్తామన్నారు. వర్షాలు పడ్డా రైతులు ఆందోళన చెందవద్దని భరోసా కల్పించారు. వారంలోగా కొనుగోళ్లు పూర్తి చేస్తామని తెలిపారు. వాహనాలు, హమాలీల కొరత వల్ల అక్కడక్కడ కొంత ఇబ్బంది ఏర్పడిందన్నారు. అయినప్పటికీ రైతులకు నష్టం కలుగనీయమని పేర్కొన్నారు. సుడా చైర్మన్ వెంట పెంచాల లక్ష్మణ్ రావు, ఉప సర్పంచ్ హన్మంత రావు, సెంటర్ ఇంచార్జి అజయ్, అశోక్ రెడ్డి, కృష్ణా రెడ్డి, సాయిల్ల రాజు, శేఖర్ ఉన్నారు.

## భక్తి శ్రద్ధలతో బక్రీద్ వేడుకలు



**ముద్ర, కోరుట్ల:** కోరుట్ల పట్టణంలో ముస్లింలు గురువారం బక్రీద్ పర్వదినా భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించుకున్నారు. పట్టణంలోని ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. పెద్ద సంఖ్యలో ముస్లింలు పాల్గొని దేశ ప్రజల శాంతి, సౌభ్రాతృత్వం, అభివృద్ధి కోసం ప్రార్ధనలు చేశారు. ప్రార్ధనల అనంతరం ఒకరినొకరు ఆలయ్–బలయ్‌లతో పలకరించుకొని బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. చిన్నారులు, యువకులు కొత్త దుస్తులతో సందడి చేస్తూ పండుగ వాతావరణాన్ని మరింత ఉత్సాహభరితంగా చేసుకున్నారు. పండుగ సందర్భంగా అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు ఈద్గా ప్రాంతాల్లో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ నియంత్రణతో పాటు భద్రతా చర్యలను కట్టుదిట్టం చేసి శాంతియుతంగా ప్రార్ధనలు జరిగేలా చర్యలు చేపట్టారు.

# ఘనంగా సరస్వతి అంత్య పుష్కరాలు

**- కొడుకుపై చెరగని మమకారంతో తల్లి పుష్కర స్నానం**



**ముద్ర, మహదేవపూర్:**
కాళేశ్వరంలో సరస్వతి అంత్య పుష్కరాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో గురువారం ఓ మాతృ మూర్తి రెండేళ్ల క్రితం మరణించిన తన కుమారుడి ఫొటో చేతబట్టి పుష్కర స్నానం ఆచరించారు. మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం బేతాళగడ్డ గ్రామానికి చెందిన గంగిశెట్టి పద్మావతి (45) తన కూతురు ఝాన్సీతో కలిసి సరస్వతి ఘాట్‌కు వచ్చి పుష్కర స్నానం ఆచరించారు. ఈ సందర్భంగా ఆమె రెండేళ్ల క్రితం విద్యుదాఘాతంతో మృతి చెందిన తన కుమారుడు గంగిశెట్టి మహేష్ ఫొటోను చేతబట్టి పుష్కర స్నానం చేశారు. కుమారుడు పై తమకున్న అనురాగానికి పలువురు ముగ్ధులయ్యారు.

**రోడ్లపై నీళ్లు చల్లుతున్న గ్రామపంచాయతీ సిబ్బంది..**

సరస్వతి అంత్య పుష్కరాల సందర్భంగా కాళేశ్వరం గ్రామపంచాయతీ పరిధిలో భక్తులకు వేడి నుంచి ఉపశమనం కల్పించడంతో పాటు శుభ్రత కోసం రోడ్లపై నీళ్లు చల్లుతున్నారు. పుష్కరాలకు భక్తులు భారీగా తరలివస్తున్న నేపథ్యంలో గ్రామంలోని ప్రధాన రహదారులు, ఘాట్‌లకు వెళ్లే మార్గాలు, పార్కింగ్ ప్రాంతాలు. ప్రజలు అధికంగా సంచరించే ప్రాంతాల్లో ప్రతి రోజు శుభ్రత పనులు చేపడుతున్నారు. ఎప్పటికప్పుడు వ్యర్థాలు తొలగిస్తూ పరిశుభ్రమైన వాతావరణం కల్పించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ట్యాంకర్ల ద్వారా రోజుకు పలుమార్లు నీటిని చల్లడం ద్వారా దుమ్ము తగ్గి, చల్లని వాతావరణం ఏర్పడేలా చర్యలు తీసుకుంటున్నారు. ఈ కార్యక్రమాల పర్యవేక్షణకు ప్రత్యేక సిబ్బందిని నియమించి, ఎక్కడా లోపాలు తలెత్తకుండా అధికారులు నిరంతరం తనిఖీలు చేస్తున్నారు. భక్తుల ఆరోగ్యం, సౌకర్యం దృష్ట్యా ఈ చర్యలు కొనసాగుతున్నాయి.

భక్తులు పరిశుభ్రతను కాపాడటంలో సహకరించాలని, చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా సూచించిన ప్రదేశాల్లో వేయాలని కలెక్టర్ రాహుల్ శర్మ కోరారు.

## ఘనంగా ఎన్టీఆర్ జయంతి




**మహదేవపూర్, ముద్ర:** మండల కేంద్రంలో గురువారం ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక తారక రామారావు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకుడు ఆన్కారి ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్టీ రామారావు తెచ్చిన రాజకీయ, సామాజిక సంస్కరణల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సతీష్ కుమార్, అయ్యుబొద్దిన్, కలికోట దేవేందర్, పోత రమేష్, కోళ్ల అశోక్ కుమార్, కొత్త పోషం తదితరులు పాల్గొన్నారు.

## రెండు గ్రామాల్లో ధాన్యం కొనుగోళ్లు పూర్తి

**- పీఏసీఎస్ చైర్మన్ నర్సారెడ్డి**




**ముద్ర, కోరుట్ల:**
కోరుట్టం మండలం ఎఖీన్‌పూర్ ప్రాథమిక వ్యవసాయ సహ కార సంఘం పరిధిలోని నాగులపేట, రామరావు పల్లె కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు పూర్తయినట్లు సొసైటీ అధ్యక్షుడు సింగిరెడ్డి నర్సారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నాగులపేట కొనుగోలు కేంద్రంలో సుమారు 11 వేల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేయగా, రామరావు పల్లె కేంద్రంలో సుమారు 5,300 క్వింటాళ్ల కొనుగోళ్లు చేసినట్లు పేర్కొన్నారు. రైతుల శ్రమకు తగిన గౌరవం దక్కేలా ప్రతి గింజ కొనుగోలు చేయడమే లక్ష్యంగా పని చేశామని తెలిపారు. తమ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతుల సౌకర్యార్థం అన్ని వసతులు కల్పించినట్లు చెప్పారు. రైతుల సంక్షేమం కోసం భవిష్యత్తులో కూడా ఇదే విధంగా కృషి కొనసాగిస్తామని ఆయన పేర్కొన్నారు. కాగా ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి సహక రించిన సంఘం వైస్ చైర్మన్, పాలకవర్గ సభ్యులు, కార్యదర్శి ఎండీ తాజోద్దీన్ బాబా, అధికారులు, సిబ్బంది, హమాలీలు. రైతులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

## ఎన్టీఆర్ సేవలు మరువలేనివి




**ముద్ర, కరీంనగర్:** పేదల కోసం ఎన్టీఆర్ చేసిన సేవలు మరువలేనివని టీడీపీ జిల్లా పార్లమెంట్ అడహక్ కమిటీ సభ్యుడు మోరే ప్రభాకర్ కొనియాడారు. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, దివంగత నేత నందమూరి తారక రామారావు జయంతి వేడుకలను గురువారం కరీంనగర్ జిల్లాలోని శంకరపట్నం మండల కేంద్రంలో ఆ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీడీపీ జిల్లా పార్లమెంట్ అడహక్ కమిటీ సభ్యుడు మోరే ప్రభాకర్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం మిఠాయిలు, పండ్లు పంపిణీ చేశారు. అనంతరం మోరే ప్రభాకర్ మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ప్రజలకు అందించిన సేవలు, సంక్షేమ పథకాల గురించి కొనియాడారు. ఎన్టీఆర్ ఆనాడే పేదలకు రెండు రూపాయలకు కిలో బియ్యం అందజేసిన మహానీయుడన్నారు. పేదల కోసం అనేక పథకాలు ప్రారంభించి చరిత్ర సృష్టించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు బైరి తిరుపతి యాదవ్, గోపి వీరమల్లు, సాబీర్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా బక్రీద్ వేడుకలు



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:**
జిల్లా వ్యాప్తంగా గురువారం బక్రీద్ పండుగ వేడుకలు ప్రశాంతంగా ముగిశాయి. పండుగను పురస్కరించుకుని జిల్లాలోని భైంసా, నిర్మల్, ఖానాపూర్ తదితర ప్రాంతాల్లోని ఈద్గాల్లో ముస్లింలు ఉదయమే ప్రార్థనలకు బారులు తీరారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసి, అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు అప్రమత్తంగా విధులు నిర్వహించారు. ఎస్పీ డా.జి.జానకి షర్మిల ప్రార్థనా స్థలాలను సందర్శిస్తూ భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. పోలీస్ అధికారులు, సిబ్బందికి సూచనలు చేస్తూ శాంతి భద్రతల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించారు. స్పీ తో పాటు అడిషనల్ ఎస్పీ ( అడ్మిన్) ఉపేందర్ రెడ్డి, నిర్మల్ డిఎస్పీ శ్రీనివాస్, భైంసా ఏఎస్పీ సా యి కిరణ్, ఇన్స్పెక్టర్లు ప్రవీణ్ కుమార్, సాయి కుమార్, రవీందర్ నాయక్, గోవర్ధన్ రెడ్డి, కృష్ణ, సమ్మయ్య, అజయ్, కిరణ్, ఆర్ఎ స్ ఐలు రామ్ నిరంజన్ రావు, శేఖర్ ఉన్నారు

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
శుక్రవారం 29.05.2026
www.mudranews.in | @mudranews



### బాదం పప్పుల ద్వారా పోషకాలు

మొలకెత్తే ప్రక్రియను ప్రోత్సహించండి:నాన బెట్టడం ద్వారా బాదం గింజల్లో మొలకెత్తే ప్రక్రియ ప్రారంభమై, అందులోని బి విటమిన్ల పరిమాణంతో పాటు మొత్తం పోషక విలువలు రెట్టింపు అవుతాయి.



## వార్డు 100 రోజుల ప్రగతి నివేదికను విడుదల



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** భువనగిరి మున్సిపల్ 22వ వార్డు కౌన్సిలర్ గా 100 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రగతి నివేదికను కౌన్సిలర్ జాలిగం విగ్నేష్ గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి సహకారంతో 100 రోజుల్లో సుమారు 10 లక్షల రూపాయలతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. రానున్న రోజుల్లో ఎక్కువ మొత్తంలో నిధులు తీసుకువచ్చి వార్డును అభివృద్ధి చేస్తామని, దానికి ప్రజలందరూ సహకరించి అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని కోరారు. వేసవిలో ఎటువంటి సమస్య రాకుండా 3 మోటార్లతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు జాలీగం శివ, ప్రమోద్, మని, వరుణ్, దినేష్, రాజేందర్, మహేందర్, రాము, ప్రసన్న కుమార్, భరత్ పాల్గొన్నారు.

## శాస్త్రీయ ఆలోచనతోనే కార్మిక వర్గ విముక్తి




**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** సమాజంలో వస్తున్న మార్పులను గమనిస్తూ, శాస్త్రీయ ఆలోచనా విధానాన్ని అలవర్చుకున్నప్పుడే కార్మిక వర్గ విముక్తి, హక్కుల సాధన సాధ్యమవుతుందని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పద్మశ్రీ కార్మికులకు పిలుపునిచ్చారు.గురువారం యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని రిటైర్డ్ ఉద్యోగుల భవనంలో సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా రాజకీయ శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ తరగతులకు ముఖ్య అతిథిగా హాజరైన ఆమె "శాస్త్రీయ ఆలోచన" అనే అంశంపై ఆమె కార్మికులకు క్లాస్ బోధించి, మాట్లాడారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలంటే కార్మికులు రాజకీయంగా, సామాజికంగా చైతన్యవంతులు కావాలని పిలుపునిచ్చారు. ముందుగా సీఐటీయూ జెండాను జిల్లా అధ్యక్షులు కోమటిరెడ్డి చంద్రారెడ్డి ఆవిష్కరించగా ఈ శిక్షణా తరగతులకు సీఐటీయూ జిల్లా కార్యదర్శి కల్లూరి మల్లేశం ప్రిన్సిపాల్ గా వ్యవహరించారు.ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఆఫీస్ బేరర్స్ దాసరి పాండు, మాయ కృష్ణ, తుర్కపల్లి సురేందర్, గొరిగే సోములు, సిలివేరు రామకుమారి, చెక్క రమేష్,పొట్ట యాదమ్మ, నకిరేకంటి రాము, పైళ్ల గణపతి రెడ్డి జిల్లా కమిటి సభ్యులు ఆదిమూలం నందీశ్వర్, గంధమల్ల మాతయ్య, చిమకండ్ల శ్రీరాములు,కసగొని లలిత, పోతరాజు జహంగీర్, మంచాల మధు , అప్పం సురేందర్, శివకుమార్, డానియల్,మారయ్య, నాయకులు గణేష్ , సిద్ధులు, వెంకటేష్, ఉపేందర్ పాల్గొన్నారు.

## తుంగతుర్తిలో నర్సింగ్ కాలేజ్ ఏర్పాటు చేయాలి



**ముద్ర, తుంగతుర్తి:** తుంగతుర్తి నియోజకవర్గ కేంద్రంలో నర్సింగ్ కళాశాల ఏర్పాటు చేయాలని తుంగతుర్తి సర్పంచ్ మల్లెపాక సాయిబాబు అన్నారు గురువారం విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గకేంద్రం లోని 100 పడకల ఆసుపత్రి కి అనుగుణంగా నూతనంగా ప్రభుత్వం ఏర్పాటు చేయ తలపెట్టిన బీఎస్సీ నర్సింగ్ కాలేజీ లలో ఒకటి అభివృద్ధిలో వెనుక బడిన నియోజకవర్గం లో ఏర్పాటు చేయాలన్నారు. తుంగతుర్తి లో నర్సింగ్ కాలేజీ ఏర్పాటు చేస్తే ఈ ప్రాంతం అభివృద్ధి తో పాటు వైద్య సేవలు మెరుగు అయితాయి అని అన్నారు. తుంగతుర్తి నియోజకవర్గం బిడ్డలైన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ,ఎంపీ చామ ల కిరణ్ కుమార్ రెడ్డి, శాసనసభ్యులు మందుల సామెల్ ,ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ లు చొరవ తీసువాలని కోరారు.

## మళ్ళీ కేసీఆర్ సీఎం కావాలంటున్న ప్రజలు

**మాజీ శాసనసభ్యుడు గాదరి కిషోర్ కుమార్**
**బీఆర్ఎస్ లో చేరికలు**




**ముద్ర, తుంగతుర్తి:** మండల పరిధిలోని కేశవాపురం గ్రామ మాజీ సర్పంచ్ కొమ్ము అనిత జనార్దన్ తో పాటు పలువురు గురువారం మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్ కుమార్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి గులాబీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాజీ శాసనసభ్యులు గాదరి కిషోర్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు మళ్లీ తెలంగాణలో కేసీఆర్ రావాలని ముఖ్యమంత్రి కావాలని ప్రజలు కోరుకుంటున్నారని, తెలంగాణకు కేసీఆరే శ్రీరామరక్ష అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు గుజ్జ యుగంధర్ రావు, కల్లెట్లపల్లి శోభన్ బాబు, మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య, గుండ గాని రాములు గౌడ్, తునికి సాయిలు గౌడ్, తడకమళ్ళ రవికుమార్, వెంకటనర్సు, వెంకన్న, లింగయ్య, వివిధ గ్రామాల మాజీ సర్పంచులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు

# భక్తి, శ్రద్ధలతో బక్రీద్ వేడుకలు









**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** బక్రీద్ పర్వదిన వేడుకలు జిల్లా కేంద్రంతో పాటు వివిధ గ్రామాలలో ముస్లింలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే ఈద్గా వద్ద కు ముస్లింలు చేరుకొని ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. జిల్లా కేంద్రం భువనగిరి పట్టణంలోని హైదరాబాద్ చౌరస్తా, నూతన ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. ఈ కార్యక్రమంలో భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరికి బక్రీద్ పండగ శుభాకాంక్షలు తెలిపారు. త్యాగానికి ప్రతీకగా ప్రతి ఒక్కరు ఈ పండుగ చేసుకొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవి కుమార్, వైస్ చైర్మన్ పోతంశెట్టి మంజుల వెంకటేశ్వర్లు, అంజుమన్ కమిటీ అధ్యక్షులు ఎంఎ.రహీమ్, గ్రంథాలయ చైర్మన్ అవైస్ చిస్తీ, మున్సిపల్ కౌన్సిలర్ లు, మాజీ మున్సిపల్ చైర్మన్ లు పాల్గొన్నారు.

**సూర్యాపేటలో..**

**ముద్ర ప్రతినిధి, సూర్యాపేట:** ఈద్గా లో బక్రీద్ పురస్కరించుకుని ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బక్రీద్ పండుగ త్యాగానికి, భక్తికి ప్రతీకగా నిలుస్తుందన్నారు. సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం, పరస్పర గౌరవాన్ని పెంపొందించే గొప్ప పండుగ అని పేర్కొన్నారు. అవసరమైన వారికి సహాయం చేయడం, పేదలను ఆదుకోవడం బక్రీద్ పండుగ ప్రధాన సందేశమని తెలిపారు. అన్ని వర్గాల ప్రజలు ఐక్యంగా, సోదరభావంతో కలిసి జీవించాలని ఈద్ ఉల్ అజ్హా పండుగ చాటి చెబుతుందన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పోతు భాస్కర్, డీసీసీ అధ్యక్షుడు గుడిపాటి నర్సయ్య, పీసీసీ ప్రధాన కార్యదర్శి చకిలం రాజేశ్వరరావు, కౌన్సిలర్లు కొండపల్లి దిలీప్ రెడ్డి, వాసు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు అంజద్ అలీ, జిల్లా కాంగ్రెస్ నాయకులు మొరిశెట్టి లక్షాది, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

**తుంగతుర్తిలో..**

**ముద్ర, తుంగతుర్తి:** త్యాగం, భక్తిలకు ప్రతీక గా బక్రీద్ పర్వదిన వేడుకలు గురువారం మండల కేంద్రంలో పాటు మండల పరిధిలోని వివిధ గ్రామాలలో ఘనంగా నిర్వహించారు .ఉదయం ఎనిమిది గంటలకే మండల కేంద్రంలో స్థానిక ఈద్గా వద్ద కు ముస్లింలు చేరుకొని ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. మజీద్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ సామూహిక ప్రార్ధనలలో మండల కేంద్రంలో పాటు పరిసర గ్రామాల ముస్లింలు హాజరయ్యారు, మహమ్మద్ ప్రవక్త బోధించిన బోధనలు, సమైక్యతను సోదర భావాన్ని అందరూ అనుసరించాలని మౌలానా మత పెద్ద కోరారు. సమాజంలో శాంతి సౌభాగ్యం ఐక్యత వర్ధిల్లాలని, అందరికీ మేలు జరగాలని కోరారు. బక్రీద్ పర్వదినం నేర్పే త్యాగం ప్రేమ సహనం అనే విలువలు ప్రతి ఇంట్లో ఆనందాన్ని నింపాలని కోరారు, అల్లా ఆజ్ఞను పాటించి తన కుమారుడిని బలి ఇచ్చేందుకు సిద్ధపడిన ఇబ్రహీం త్యాగాన్ని కొనియాడారు. అందుకు సాంప్రదాయ బద్దంగా కుర్బానీని ముస్లింలు చేశారన్నారు. కుర్బానీలో ఇచ్చిన మాంసాన్ని మూడు భాగాలుగా విభజించి ఒక భాగాన్ని తమ కొరకు మరో భాగాన్ని బంధుమిత్రులకు మిగిలిన భాగాన్ని పేదలకు పంపిణీ చేసి తమ పరోపకార గుణాన్ని చాటుకున్నారు ప్రార్ధనల అనంతరం ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు తాటికొండ సీతయ్య, కాంగ్రెస్ నాయకులు సింగల్ విండో చైర్మన్ గుడిపాటి సైదులు ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు, ఈ కార్యక్రమంలో మజీద్ కమిటీ అధ్యక్షులు ఎండి జాన్, ఉపాధ్యక్షులు ఎస్కే లాల్, ప్రధాన కార్యదర్శి ఎస్కె భాష, కోశాధికారి అన్వర్, మైనారిటీ యూత్ కమిటీ అధ్యక్షులు ఎస్ కే నజీర్, ఉపాధ్యక్షులు మొహమ్మద్ అబ్దుల్, కార్యదర్శి ఎస్కె కరీం, నాయకులు ఉస్మాన్, ఎండి మజీద్, మీరా సాబ్, అలీ సాబ్, ట్రాఫిక్, సిద్ధిక్,సమీర్, ఫాజులోద్దీన్, వహీద్, ఎస్కే జానీ మియా, ఆషిక్ ఇలాహి, షబ్బీర్, ఖలీల్, జానీ, అక్రమ్, తదితరులు పాల్గొన్నారు

# ఎన్టీఆర్ కు ఘన నివాళి

**లకారం ట్యాంక్ బండ్ వద్ద పువ్వాడ, నామ, సండ్ర, తాటి నివాళి**







**ముద్ర ప్రతినిధి, ఖమ్మం:** ఖమ్మం నగరంలోని లకారం ట్యాంక్ బండ్ వద్ద మహానటుడు, మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామారావు 103వ జయంతి సందర్భంగా బిఆర్ఎస్ నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకట వీరయ్య, తాటి వెంకటేశ్వర్లు పాల్గొని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ తెలుగు జాతి ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన మహానాయకుడు ఎన్టీఆర్ అని, పేదల సంక్షేమం కోసం ఆయన ప్రవేశపెట్టిన పథకాలు చరిత్రలో నిలిచిపోతాయన్నారు, రాజకీయాలకతీతంగా ఎన్టీఆర్ సేవలు స్మరించుకోవాల్సిన అవసరం ఉంది అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నగర ప్రముఖులు, నాయకులు, కార్యకర్తలు, ఎన్టీఆర్ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**యన్టీఆర్ కు భారత రత్న ప్రకటించాలి**

ఉమ్మడి రాష్ట్ర పూర్వ ముఖ్యమంత్రి, తెలుగువారి ఆత్మగౌరవాన్ని దశ దిశలా చాటి చెప్పిన దివంగత నందమూరి తారక రామారావు జయంతి పురస్కరించుకొని గురువారం వారధి ఫౌండేషన్ చైర్మన్ చింతనిప్పు కృష్ణ చైతన్య ఘనంగా నివాళులర్పించారు. ఖమ్మం ఎన్టీఆర్ సర్కిల్ లోని నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చింత నిప్పు కృష్ణ చైతన్య మాట్లాడుతూ తెలుగుజాతి గౌరవాన్ని దేశ విదేశాలలో ఇనుమడింపజేసి తెలుగు భాషకు కీర్తి ప్రతిష్టలు తీసుకుని వచ్చిన అన్న ఎన్టీఆర్ జీవితం ప్రతి ఒక్కరికి మార్గదర్శకం అని తెలిపారు. ఎన్టీఆర్ చూపిన మార్గంలో తెలుగువారి ప్రతిష్ట పెరిగేలా కృషి చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. ఎన్టీఆర్ కు కూడా కేంద్ర ప్రభుత్వం భారతరత్న ప్రకటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మోతారపు శ్రావణి సుధాకర్, ఎన్టీఆర్ అభిమానులు పాల్గొన్నారు.

**సూర్యాపేటలో..**

**ముద్ర ప్రతినిధి, సూర్యాపేట:** మాజీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి, సినీ నటులు నందమూరి తారక రామారావుకు భారతరత్న ఇవ్వాలని, ఆయన జీవితం భావి తరాలకు ఆదర్శప్రాయమని ఎన్టీఆర్ అభిమాని, మాజీ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ పెద్దిరెడ్డి రాజా డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని నల్లాల బావి చౌరస్తా నందు డిసిసి కార్యదర్శి, ఎన్టీఆర్ అభిమాని నేరేళ్ళ మధు గౌడ్ ఆధ్వర్యంలో ప్రముఖ సినీ నటుడు స్వర్గీయ నందమూరి తారక రామారావు 103 వ జయంతి వేడుకలలో ముఖ్య అతిథిగా హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సుమారు 40 ఏళ్లకు పైగా తెలుగు చలనచిత్ర పరిశ్రమలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుని దేవుడి పాత్ర ఏదైనా ఆ పాత్రకు వన్నె తేవడమే కాక, ఆ రూపం నిజమైన దేవుడేనని నమ్మేంతగా పాత్రలో ఒదిగిపోయే వ్యక్తి ఎన్ టి ఆర్ అని, పార్టీ పెట్టిన తొమ్మిది నెలలకే రాష్ట్ర ముఖ్యమంత్రి పీఠాన్ని కైవసం చేసుకున్న ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ప్రజల అవసలను తెలుసుకుని తాలుకాలను రద్దు చేసి, మండలాలుగా ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. బడుగు బలహీన వర్గాలకు ఆరాధ్య దైవంగా భావించే వ్యక్తి ఆయన అని, క్రమశిక్షణకు మారుపేరు, ఆయన పేరంటేనే ఒక విప్లవం అని పేర్కొన్నారు. అలాంటి మహోన్నత వ్యక్తి సేవలను గుర్తించి ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం, ప్రధాని మోడీ భారతరత్న ఇవ్వాలన్నారు. తెలుగు జాతి వారి ఆత్మ గౌరవాన్ని కాపాడిన మహనీయులు ఎన్టీఆర్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డిసిసి జనరల్ సెక్రటరీ పెద్దిరెడ్డి కళ్యాణ్, డిసిసి కార్యదర్శి షేక్ మీరా, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ పోలెబోయిన నర్సయ్య, కొండగడుపుల సూరయ్య,శ్రీపాది శంకర్, పొదిళ హరి, జితేందర్, బాణాల హరి, ఎలూరి వెంకటేశ్వర్లు, కొండా రాజేష్, నేరెళ్ల నరేష్, జాని మీయా, గుణగంటి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# కారు ప్రమాదం.. ఏలూరి కుటుంబానికి తప్పిన ముప్పు



**ముద్ర ప్రతినిధి, ఖమ్మం:** తెలంగాణా గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు కుటుంబానికి పెను ప్రమాదం తప్పింది..ఖమ్మం జిల్లా వైరా మండలం గొల్లపూడి గ్రామం వద్ద వైరా–మధిర మార్గంలో ఓ రైతు పొలంలో వ్యర్థాలకు నిప్పంటించగా, అగ్నికీలల కారణంగా ఓ చెట్టుకు కూడా నిప్పంటుకుంది..దీంతో ఆ భారీ వృక్షం ఏలూరి శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు ప్రయాణిస్తున్న కారుపై పడింది. దీంతో కారు బోల్తా పడింది. ఘటనలో కారు ధ్వంసం కాగా, కారులో ఉన్న ఏలూరి శ్రీనివాసరావు తల్లి, తండ్రి, భార్య, డ్రైవర్ కి స్వల్ప గాయాలు అయ్యాయి. పెద్ద ప్రమాదం తప్పింది.పొలంలో చెత్త కాల్చడం వల్ల ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డు పక్కన చెట్ల దగ్గర మంటలు పెట్టకుండా రైతులు జాగ్రత్త పడాలి.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శుక్రవారం 29.05.2026
www.mudranews.in | @mudranews



**బాదం పప్పుల ద్వారా పోషకాలు:**

అన్ని వయసుల వారూ ప్రతిరోజూ అలవాటు చేసుకోండి:



చిన్న పిల్లల నుండి వృద్ధుల వరకు ప్రతి ఒక్కరూ రోజూ ఉద యాన్నే నానబెట్టిన బాదం తినడం వల్ల శరీరానికి కావలసిన శక్తి, రోగనిరోధక శక్తి లభిస్తాయి.

# ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వ నిర్లక్ష్యం

**- మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డి**



**ముద్ర ప్రతినిధి, మెదక్:** ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డి ఆరోపించారు. గురువారం నార్సింగి మండలంలోని శేరిపల్లి, శంకరంపేట్ (ఆర్) మండలం కామారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల్లో ఉన్న రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ధాన్యం కొనుగోళ్లు సక్రమంగా జరగడం లేదన్నారు. కొనుగోలు ప్రక్రియ చాలా నెమ్మదిగా కొనసాగుతోందని తెలిపారు. ముఖ్యంగా లారీలు సమయానికి అందుబాటులో లేకపోవడంతో రోజుల తరబడి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్దే నిల్వ ఉండిపోతుందని చెప్పారు. అకాల వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ధాన్యం తడిసి మొలకెత్తుతుందనే భయంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారని వెల్లడించారు. ఆమె వెంట శంకరంపేట, నార్సింగి మండలాల బీఆర్ ఎస్ అధ్యక్షులు పట్లోరి రాజు, కుమ్మరి బాబు, నార్సింగ్ మండల మాజీ జడ్పీటీసీ కృష్ణారెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు కోల్కురి లక్ష్మారెడ్డి, సర్పంచ్‌లు గౌండస్వామి, ఇమ్మడి నరేష్, మాజీ సర్పంచ్‌లు పూలపల్లి యాదగిరి యాదవ్, శ్రీనివాస్ రెడ్డి, దయానంద్ యాదవ్, మండల నాయకులు పడాల శ్రీనివాస్, ఏమా వెంకటేశం, వడ్డెర సిద్దిరాములు, మహేష్ గౌడ్, అంజయ్య, నర్సింగరావు, యూత్ నాయకులు సురేష్, సురేష్ తదితరులు ఉన్నారు.

## తడిసిన ధాన్యం సైతం కొంటాం

**- మెదక్ కలెక్టర్ ప్రతిమా సింగ్**



**ముద్ర ప్రతినిధి, మెదక్:** వర్షాలతో తడిసిన ధాన్యం సైతం కొనుగోలు చేస్తామని కలెక్టర్ ప్రతిమా సింగ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో వర్షాల కారణంగా తడిసిన నాలుగు వేల క్వింటాళ్ల ధాన్యం బాయిల్డ్ మిల్లులకు తరలించినట్లు పేర్కొన్నారు. రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రత్యేక చర్యలు అమలు చేస్తోందన్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు 62,103 రైతుల నుంచి 2,85,054 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశా మన్నారు. 43,433 మంది రైతులకు రూ.468.18 కోట్లు వారి ఖాతాల్లో జమ చేశామని పేర్కొన్నారు. ఇప్పటివరకు జిల్లాలో 30 కేంద్రాల్లో కొనుగోళ్లు పూర్తి చేశామని వెల్లడించారు. అకాల వర్షాలను దృష్టిలో ఉంచుకుని జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా వ్యవహరిస్తూ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడవకుండా తగిన రక్షణ చర్యలు చేపడుతోందన్నారు. ధాన్యం కొనుగోళ్లో సమస్యలు, సందేహాల పరిష్కారం కోసం జిల్లా సివిల్ సప్లయ్స్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నంబర్/కంట్రోల్ రూం నంబర్. 9391942254 ను సంప్రదించాలని రైతులకు సూచించారు.

## ధాన్యం సకాలంలో మిల్లులకు తరలించే ఏర్పాట్లు చేయాలి



**ముద్ర, హైదరాబాద్:** ధాన్యం సకాలంలో మిల్లులకు తరలించేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కామారెడ్డి కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ సూచించారు. కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలంలోని లచ్చపేట మహాబాల రైస్ మిల్లు, లక్ష్మీరావులపల్లి ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, అదనపు కలెక్టర్ విక్టర్‌తో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా వరి ధాన్యం కొనుగోళ్లు, అన్‌లోడింగ్ ప్రక్రియ, రవాణా ఏర్పాట్లపై సమీక్షించారు. ధాన్యం సకాలంలో మిల్లులకు తరలించేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. బక్రీద్ పండుగ సందర్భంగా డ్రైవర్ల కొరత లేకుండా రవాణా కార్యకలాపాలకు అంతరాయం కలగకుండా ఉండేందుకు జిల్లా కలెక్టర్ ఇటీవల ట్రాన్స్‌పోర్టు యజమానులతో సమావేశం నిర్వహించి, నిరంతరం రవాణా సేవలు కొనసాగించాలని ఆదేశించారు. వరి రవాణాలో పాల్గొంటున్న డ్రైవర్ల సేవలను అభినందిస్తూ, ముఖ్యంగా మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి వచ్చిన డ్రైవర్లకు జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ దుస్తులు, నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. జిల్లా యంత్రాంగం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ట్రాన్స్‌పోర్టు యజమానులను, డ్రైవర్లు అభినందిస్తూ, వరి ధాన్యం సకాలంలో తరలింపునకు పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

## సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలి



**ముద్ర, హైదరాబాద్:** బీఆర్ఎస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గురువారం మాజీ ఎమ్మెల్యే హనుమంత్ షిండే ఆ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కామారెడ్డి జిల్లా మద్నూర్ మండల కేంద్రంలోని మైథిలి ఫంక్షన్ హాల్ లో శుక్రవారం జరగబోయే పార్టీ సభ్యత్వ నమోదు, ఎస్ఐఆర్ సన్నాహక సమావేశానికి జుక్కల్ నియోజకవర్గం లోని మహ్మద్ నగర్, నిజాంసాగర్, పిట్లం, పెద్ద కొడప్గల్, జుక్కల్, బిచ్కుంద, మద్నూర్, డోంగ్లి మండలాల బిఆర్ఎస్ పార్టీ నాయకులు, బిచ్కుంద మున్సిపాలిటీ యూత్ సమన్వయ కమిటీ సభ్యులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

ఈ సన్నాహక సమావేశానికి ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, జిల్లా నాయకులు, ఇన్చార్జులు పాల్గొంటారని పేర్కొన్నారు. సభ్యత్వ నమోదు ప్రక్రియ పార్టీ పూర్తిగా ఆన్లైన్ విధానంలో చేపడుతుందని తెలిపారు. నియోజకవర్గంలో నియమితులైన యూత్ సమన్వయ కమిటీ సభ్యులు నాయకులతో మమేకమై ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని సూచించారు. ఎండల తీవ్రత దృష్ట్యా తగు జాగ్రత్త చర్యలు తీసుకొని సమావేశానికి హాజరై విజయవంతం చేయాలని కోరారు.

## వేగంగా ధాన్యం అన్ లోడింగ్ చేయాలి

**- మెదక్ అదనపు కలెక్టర్ నగేష్**



**ముద్ర ప్రతినిధి, మెదక్:** వేగంగా ధాన్యం అన్ లోడింగ్ చేయాలని అదనపు కలెక్టర్ నగేష్ గోదాం నిర్వాహకులను ఆదేశించారు. జిల్లాలోని కొల్చారం మండల వరిగుంతం గోడౌను గురువారం తనిఖీ చేశారు. ధాన్యం కొనుగోలు, నిల్వ కోసం ఏర్పాటు చేసిన గిడ్డంగిని పరిశీలించారు. సేకరించిన ధాన్యాన్ని ఈ గిడ్డంగిలో నిల్వ చేయనున్నట్లు తెలిపారు. గిడ్డంగిలోని నిల్వ సామర్థ్యం, అందుబాటులో ఉన్న సౌకర్యాలు ,భద్రతా ఏర్పాట్లను పరిశీలించి సంబంధిత అధికారులకు అవసరమైన సూచనలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లారీలను, లేబర్ ను అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. అన్ లోడింగ్ ఆలస్యం జరగకుండా మరింత పకడ్బందీగా చర్యలు తీసుకో వాలన్నారు. అన్ లోడింగ్ లో హమాలీని షిఫ్ట్ ల ప్రకారం పని చేయించాలని సూచించారు.

## రైతులపై కపట ప్రేమ చూపిస్తున్న ప్రభుత్వం

**-ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి**



**ముద్ర, హైదరాబాద్:** కాంగ్రెస్ ప్రభుత్వం రైతులపై కపట ప్రేమ చూపిస్తుందని, ప్రభుత్వ నిర్లక్ష్యమే ధాన్యం కొనుగోళ్ల జాప్యానికి కాంగ్రెస్ ప్రభుత్వమే కారణమని ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి మండిపడ్డారు. ధాన్యం కొనుగోలు జాప్యం కారణంగా కొనుగోలు కేంద్రాలలో రైతులు పడుతున్న ఇబ్బందులు, అకాల వర్షాలకు ధాన్యం తడిసి మొలకెత్తిన వైనంపై ఆమె గురువారం మెదక్ జిల్లాలోని మండల కేంద్రమైన వెల్దుర్తి లోని కుకునూరు చౌరస్తా వద్ద రైతు పక్షాన నిర్వహించిన ధర్నాలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులు తమ ఇబ్బందులను ఏకరువు పెట్టారు కోతలు కోసి ధాన్యం తెచ్చి నెలన్నరకు పైగా అవుతుందని, ఇప్పటికీ గింజ కూడా కొనుగోలు చేయలేదని ఆరోపించారు. తూకం వేసిన ధాన్యం కూడా తరలించడంలో అధికారులు పూర్తి నిర్లక్ష్యం వహిస్తున్నారని, వాహనాలు రావడం లేదంటూ ధాన్యం బస్తాలను కేంద్రాలలోనే నిలువ చేస్తున్నారని వివరించారు.

కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నమ్మి సపోయామని దొంగల రాజ్యం వచ్చిందని, ఒక రోజు దొంగ అయితే పట్టుకోవచ్చని కానీ తాము రోజు దొంగలపాలు అవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం కొనకపోతే తాము బ్యాంకు రుణాలు కానీ, ఇంటి బిల్లులు గాని, ప్రభుత్వ సంబంధించిన ఏ బిల్లులు కూడా తాము చెల్లించబోమని అన్నారు.

ఎమ్మెల్యే మాట్లాడుతూ కేసీఆర్ రెండు పంటలకే రైతుబంధు ఇస్తున్నారని, తాము మూడు పంటలకు ఇస్తామని, రెండు లక్షల ఏకకాల రుణమాఫీ చేస్తామని ఎన్నికల్లో హామీలిచ్చిన కాంగ్రెస్ రైతులను నట్టేట ముంచిందన్నారు. ధాన్యం కొనుగోళ్లను తప్పించుకునేందుకు హామాలీలు లేరని, లారీలు రావడంలేదని, రైస్ మిల్లలు ధాన్యం తీసుకోవడం లేదని చిన్నచిన్న కారణాలు చెబుతున్నారని ఆరోపించారు.

ధాన్యం కొనుగోలు చేసే ముందు ధారణ ఏర్పా ట్లు చేసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానికి లేదా అని ప్రశ్నించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా బేషరతుగా తడిచిన ధాన్యం, మొలకెత్తిన ధాన్యం, రంగు మారిన ధాన్యాన్ని చివరి గింజ వరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

## పూర్వ విద్యార్థుల సమ్మేళనం



**ముద్ర, హైదరాబాద్:** మెదక్ జిల్లా ఝరాసంగం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. 1999-2000 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులంతా కలసి దాదాపు 26 ఏళ్ల తర్వాత సహచర విద్యార్థులంతా ఒకే వేదికపైకి చేరడంతో ఆ ప్రాంతంలో పండుగ వాతావరణం నెలకొంది. ఒకరినొకరు పలకరించుకుంటూ, అలనాటి మధుర జ్ఞాపకాలను, పాఠశాల రోజుల్లోని ముచ్చట్లను గుర్తుచేసుకుంటూ రోజంతా ఉత్సాహంగా గడిపారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు శేషారావు, పాపిరెడ్డి, సంగమేశ్వర్, అంజయ్య, ప్రతాప్ రెడ్డి, బసవలింగప్ప, నాగన్న, ఖుద్దూస్, చంద్రశేఖర్‌లను విద్యార్థులు శాలువాలు, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించి పాదాభివందనం చేశారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఎక్కడ ఉన్నా క్రమశిక్షణతో, ఉన్నత విలువలతో జీవించాలని, నాటి విద్యార్థులు నేడు వివిధ రంగాల్లో స్థిరపడి సమాజసేవలో భాగస్వాములు కావడం గర్వకారణంగా ఉందన్నారు.

## బడుగు వర్గాల ఆశాజ్యోతి ఎన్టీఆర్



**ముద్ర, హైదరాబాద్:** బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, పేదల పెన్నిధి ఎన్టీఆర్ అని నిజామాబాద్ జిల్లాలోని బీర్కూర్ ఎన్టీఆర్ అభిమాన సంఘం మండలాధ్యక్షుడు గుత్తికొండ ఓంకార్ అన్నారు. బీర్కూరు మండల కేంద్రంలో గురువారం దివంగత నందమూరి తారక రామారావు జయంతి వేడుకలను ఎన్టీఆర్ అభిమాన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మిఠాయిలు పంపిణీ చేశారు.

## ఘనంగా ఎన్టీఆర్ జయంతి వేడుకలు




**ముద్ర, హైదరాబాద్:** నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి దలంలోని ధర్మారం(బి) గ్రామంలో గురువారం ఎన్టీఆర్ జయంతి వేడుకను అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ.. పేదల పాలిట పెన్నిధిగా ఎన్టీఆర్ అన్నారు. ఎన్టీఆర్ ఆనాడే పేదలకు రెండు రూపాయలకు కిలో బియ్యం అందజేసిన మహనీయుడన్నారు. పేదల కోసం అనేక పథకాలు ప్రారంభించి చరిత్ర సృష్టించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అభిమానులు బ్రహ్మనందం, సుబ్బారావు, చౌదరి, కేశవరావు, వేంకటేశ్వరావు, మురారీ, పాల్గొన్నారు. అనంతరం టీడీపీ జిల్లా అధ్యక్షులు యాదగిరిగౌడ్ ధర్మారం వచ్చి అభిమానులతో మాట్లాడారు.

## దరఖాస్తుల ఆహ్వానం

**ముద్ర, హైదరాబాద్:** మెదక్ జిల్లాలోని దుర్కి బీఈడీ కళాశాలలో కొనసాగుతున్న గిరిజన బాలికల సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ శ్యామలాదేవి తెలిపారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీ గ్రూపులో మిగిలిన సీట్లను భర్తీ చేయనున్నట్లు ఆమె చెప్పారు. విద్యార్థులు నేరుగా కళాశాలకు వచ్చి ప్రవేశం పొందాలని సూచించారు. కులం, ఆదాయం, పదో తరగతి ధ్రువీకర పత్రాలతో హాజరు కావాలన్నారు.

Printed and published by Executive Director Aliminati Indra Reddy, on behalf of M/s Networth Media Private Limited. Printed at Colour Dot Graphics, Ali cafe X Road, Amberpet, Hyderabad-500013.Published at H. No. 6-3-569/2, unit 4A Fourth Floor, Kamadhenu, Rockdale compound, Somajiguda, Hyderabad-500082. Editor: Y. Narender Reddy. RNI No: TELTEL/2013/50413. email: mudradaily@gmail.com